www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1 మే 2023



నేడు యథావిధిగా 'స్పందన'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. అల స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

సమస్యల వలయంలో అన్నమయ్య ఆర్‌టిసి డిపో

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా క్వార్టర్లు
డివిజన్ కేంద్రమైనా ఆగని బస్సులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది రాజంపేట అన్నమయ్య ఆర్టీసీ డిపో. రాజంపేట, రైల్వే కోడూరు రెండు నియోజకవర్గాలకు కలిపి రాజంపేట అన్నమయ్య ఆర్టీసీ డిపో ఏకైక కేంద్రమైనప్పటికీ ఇక్కడ తగిన సౌకర్యాలు లేక వెలవెలబోతోంది. తవ్వే కొద్దీ అనేక సమస్యలు ఇక్కడ బయటపడుతున్నాయి. అన్నమయ్య ఆర్టీసీ డిపో సమస్యల వలయంలో ఉందని చెప్పడంలో సందేహం లేదు.



బస్టాండ్ ముందు వాహనాల పార్కింగ్

వేధిస్తున్న బస్సు సర్వీసుల కొరత

గత ఏడాది 100 బస్సు సర్వీసులతో కళకళలాడిన డిపో నేడు 75 సర్వీసులకే పరిమితమైంది. డిపో నుంచి శ్రీశైలం, చెన్నై, హైదరాబాద్, పెంచలకోన, మదనపల్లి, వేలూరు, కాణిపాకం, చిత్తూరు వంటి ప్రధాన ప్రాంతాలకు సర్వీసులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం ఐదు దాటితే తిరుపతి వైపు గానీ, వందలాది గ్రామాలు ఉన్న రైల్వే కోడూరు, చిట్వేల్‌కు గానీ బస్సు సర్వీసులు లేకపోవడంతో సాయంత్రం ఐదు నుంచి చిట్వేలి, రైల్వేకోడూరు మార్గాలలో వందలాది మంది ప్రయాణికులు వేచి ఉంటూ చివరకు ఆటోలు, జీపులలో ప్రయాణించాల్సి వస్తోంది. వాహనదారులు కాసులకు కక్కుర్తి పడి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని చిట్వేలికి, రైల్వేకోడూరుకు వాహనాలను తిప్పుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ మార్గాలలో బస్సు సర్వీసులను పెంచి సాయంత్రం ఐదు తర్వాత బస్సులను అందుబాటులో ఉంచితే సంస్థకు లాభాలతో పాటు ప్రజలకు సౌకర్యం కల్పించినట్లు ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

ప్రథమ వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల పేరు మీదుగా స్థాపించబడిన రాజంపేట అన్నమయ్య ఆర్టీసీ డిపో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి కేటాయించిన ఆర్టీసీ క్వార్టర్లులో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు ఖాళీ చేయడంతో ఆ గృహాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఆ క్వార్టర్లు మందు బాబులకు, పేకాట రాయుళ్లకు అడ్డాగా మారి చెత్త-చెదారంతో మురికి కూపంగా తయారైంది. దీంతో ఆ గృహాలు పందులు, కుక్కలు, దోమలకు ఆవాసమై విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి.



నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్

డిపో కేంద్రానికి రాని బస్సు సర్వీసులు

రాజంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రమైనప్పటికీ రాజంపేటతో పాటు రైల్వే కోడూరుకు కూడా రెండు నియోజకవర్గాలకు ఒకటే ఆర్టీసీ డిపో. అయినప్పటికీ ఆర్టీసీ డిపోలోకి కర్నూల్, నంద్యాల బస్సులతో పాటు కొన్ని సర్వీసులు రాకపోవడం చేత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డిపోలోకి రాకుండా సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని బైపాస్ గుండా వెళుతూ ప్రయాణికులను అక్కడే దించివేయడంతో రాత్రి వేళ మహిళా ప్రయాణికులు, వృద్ధులు, చిన్నపిల్లలు వారి గమ్యానికి చేరుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో టిడిపి హయాంలో రెడ్యం వెంకట సుబ్బారెడ్డి రీజనల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు అన్ని బస్సులను ఆర్టీసీ డిపోలోకి వచ్చేందుకు కృషి చేసి సఫలీకృతులయ్యారు. నేడు మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో బస్సు సర్వీసులను డిపోలోకి రప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

దిష్టిబొమ్మను తలపిస్తున్న పెట్రోల్ బంకు

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపేందుకు సంస్థ చేస్తున్న అనేక ప్రయత్నాలలో భాగంగా డిపో పరిధిలోనే పెట్రోల్ బంకును నిర్మించాలన్న సత్సంకల్పంతో డిపో ఆవరణలో ముందు భాగాన పెట్రోల్ బంకు నిర్మాణానికి పూనుకొని పన్ను చెల్లించే క్రమంలో ఎదురైన సమస్య కారణంగా పెట్రోల్ బంకు నిర్మాణం ఆదిలోనే ఆగిపోవడంతో డిపో ముందు దిష్టి బొమ్మలా దర్శనమిస్తోంది. అసంపూర్తిగా ఉండడంతో మందుబాబులు దీనిని బారులా వినియోగిస్తున్నారు. దీంతో డిపోలోకి ఆ మార్గం గుండా వెళ్లే ప్రయణీకులు చాలా అసౌకర్యానికి గురౌతున్నారు. డిపో మేనేజర్ చొరవ తీసుకొని పెట్రోల్ బంకు నిర్మాణం పూర్తి చేస్తే సంస్థకు ఆదాయ వనరుగానే కాక ఆకర్షణీయంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని వాటర్ ప్లాంట్

గ్యారేజీలో పని చేసే ఆర్టీసీ కార్మికులకు, సిబ్బందికి దాహార్తిని తీర్చే వాటర్ ప్లాంటు చెడిపోయి ఏడాదికి పైగా కావస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో కార్మికులతో పాటు ఆర్టీసీ సిబ్బంది మంచినీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి ఎదురైంది. వాటర్ ప్లాంటులో తాగు నీరు అందుబాటులో ఉన్నా, యంత్రాలు చెడిపోయి చల్లని నీరు రాక సిబ్బంది వేసవి తాపానికి గురవుతున్నట్లు సమాచారం.

వృథాగా క్యాంటీన్, వాణిజ్య గదులు

బస్సు సర్వీసులు అన్నమయ్య డిపోలోకి రాకపోవడంతో ప్రయాణికులు తక్కువ కావడం చేత చాలాకాలంగా క్యాంటీన్, వాణిజ్య గదులు మూతపడి ఉన్నాయి. కనీసం మంచినీరు కావాలన్నా డిపో బయటికి వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పార్కింగ్ లేక అస్తవ్యస్తంగా వాహనాలు

డిపో ఆవరణలో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసి డిపోలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా ప్రధాన ద్వారం వద్ద కూడా అడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. డిపో ఆవరణలో పార్కింగ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండటమే గాక సంస్థకు ఆదాయాన్ని చేకూర్చే మార్గం కూడా లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సమస్యలను చక్కదిద్దుతున్నాం : డిఎం

క్యాంటీన్, పార్కింగ్ స్థలానికి మే 15న టెండర్లు పిలుస్తున్నామని, పెట్రోల్ బంకు నిర్మాణానికి అభివృద్ధి పన్ను చెల్లించి త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామని డిపో మేనేజర్ జి.రమణయ్య తెలిపారు. బస్సు సర్వీసులను డిపోలోకి రప్పించేందుకు ప్రధాన రహదారిలో సిబ్బందిని నియమించి బస్సులను డిపోలోకి రప్పిస్తున్నామని, చార్టర్‌లో కూడా సంతకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు డిపో ఆవరణలో కంట్రోల్ పాయింట్ వద్ద దాతల ద్వారా వాటర్ కూలర్ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నామని తెలియజేశారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

ఐసిడిఎస్ పీడీ ఎం.ధనలక్ష్మి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

అంగన్వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే తమ లక్ష్యమని జిల్లా మహిళా శిశు సంక్షేమ , సాధికారత అధికారిని మిద్దింటి ధనలక్ష్మి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఐసి డిఎస్ ప్రాజెక్టుల పనితీరు, అంగన్వాడీలో చిన్నపిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు, అందుతున్న పౌష్టికాహారం, వసతుల గురించి ఎలా అందించాలో, అంగన్వాడీ పోస్టుల భర్తీకి చేపడుతున్న చర్యలను ప్రజాశక్తి ఇచ్చిన ముఖా ముఖిలో ఆమె వివరించారు .

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు వివరాల తెలపండి?

జిల్లాలో 9 ఐసిడిఎస్ ప్రాజెక్టులున్నాయి . ఇందులో మెయిన్ కేంద్రాలు 1858, మినీ 417, మొత్తం 2275 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. జిల్లాలో మొత్తం లో 79 గ్రేడ్-1 అండ్ 2 సూపర్‌వైజర్లున్నారు

పౌష్టికాహారం వివరాలు తెలపండి?

గర్భిణులు, బాలింతలు కలిపి మొత్తం జిల్లాలో 23,455 మంది ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి వైఎస్ఆర్(రాగిపిండి 1 కేజీ, జొన్నపిండి 1 కేజీ, అటుకులు 1 కేజీ, ఎండు కర్జూరం 250 గ్రాములు, వేరుశెనగ చిక్కి 250 గ్రాములు , బెల్లం 250 గ్రాములు చొప్పున) ఇంటికి అందజేస్తున్నాం. రోజూ మధ్యాహ్నం అంగన్వాడీ కేంద్రంలో ఒక పూట భోజనంతోపాటు గుడ్డు, పాలు అందజేస్తున్నాం. మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు పిల్లలు జిల్లా వ్యాప్తంగా 41,075 మంది ఉన్నారు. వారికి రోజూ అంగన్వాడీ కేంద్రంలో ఒక పూట భోజనంతో పాటు 1 గుడ్డు, పాలు 100 మిల్లీ లీటర్లు అందజేస్తున్నాం. 6 నెలల నుంచి 3 సంవత్సరముల పిల్లలు జిల్లా మొత్తంలో 56,667 మంది పిల్లలు ఉన్నారు. వీరికి నెలకు మొదటి విడతలో 13 గుడ్లు, 1.5 లీటర్ల పాలు, రెండవ విడతలో 12 గుడ్లు, 1.0 లీటరు పాలతో పాటు 2.5 కేజీల బాలామృతం అందజేస్తున్నాం.

జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా మెయిన్, మినీ అంగన్వాడీ కార్యకర్తలు కలిపి 20 పోస్టులు , సహాయకురాలు 34 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బాల్య వాహల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

బాల్యవివాహాల నివారణకు జిల్లా, మండల స్థాయి ల్లో కమిటీలు ఏర్పాటు చేశాం. అంగన్వాడీ కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారులవరకు అందరూ కలిసి గ్రామాలలో, పాంశాలల్లో బాలికల హాస్టల్‌లో పిల్లలకు, తల్లితండ్రులకు అవగాహన పెంపొందిచడానికి సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

అదనపు అంగన్వాడీ కేంద్రాలకు ప్రతిపాదనలను ఏమైనా పంపారా ?

అదనపు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చెయ్యడానికి జిల్లాలో సిడిపిఒలకు ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడ అదనపు అదనపు అంగన్వాడీ కేంద్రం అవసరమో అక్కడ ఏర్పాటు చేసేందుకు సర్వే చేస్తున్నారు. అదనపు అంగన్వాడీ కేంద్రం అవసరం ఉన్నదో వాటిని సర్వే చేస్తున్నారు.

కర్ణాటక ఎన్నికలే బిజెపి పతనానికి నాంది : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న కాంగెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్

ప్రజావ్యతిరేక విధానాలను ఆవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పతనానికి కర్ణాటక ఎన్నికలే నాంది కావాలని అన్నమయ్య జిల్లా, మదనపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. ముఖ్యంగా నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయని, దీంతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారని వాపోయారు. జిఎస్‌టి రూపంలో లక్షల కోట్లు వసూలు చేస్తున్నారని, ఈ ధనాన్ని ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. దేశ సంపదను కార్పొరేటర్లకు దోచిపెట్టడమే బిజెపి విధానమని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపిన వారిపై ఈడీ, సిబిఐల చేత విచారణ పేరిట తప్పుడు కేసులు పెట్టి వారిని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జిఎస్‌టి ఎత్తివేస్తామని రాహుల్ గాంధీ చెప్పడం హర్షణీయమన్నారు. అదేవిధంగా త్వరలో కర్ణాటకలో జరుగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్ర నుంచి వలస వెళ్లిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు. బిజెపి ఎన్ని కుతంత్రాలు పన్నినా కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అరాచకాలు, దౌర్జన్యాలు మితిమీరి పోయాయన్నారు. ప్రజలు ఇబ్బందులు తొలగాలంటే అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మహబూబ్ పీర్, జీవన్ కుమార్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - రాయచోటి

ఉపాధ్యాయులు వృత్తిలో ఉత్తమ సేవలు అందించడం ద్వారానే గుర్తింపు లభిస్తుందని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. పాఠశాలలో డిప్యూటేషన్ పై పనిచేస్తూ తిరిగి వెళ్లిన రాజా రాణెమ్మ, నాగార్జున ఉపాధ్యాయులకు, ఉద్యోగన్నతిపై వచ్చిన రవీంద్ర రాజు, నాగరాణిని ఆదివారం హైస్కూల్ ఆవరణంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమాజ సంస్కర్తలు గురువులన్నారు. సమాజంలో గురువులకే అత్యంత ఉన్నత స్థాయి హోదా కలిగి ఉందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ను ఆదర్శంగా తీసుకొని పనిచేసి సమాజాన్ని మంచి మార్గంలో నడిపించాలన్నారు. సమాజానికి గురువులే కళ్లు, చెవులని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే గురువులే కీలకమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, పాఠశాల అభివృద్ధికి నాగార్జున, రాజా రాణెమ్మ, రవీంద్రరాజు, నాగరాణిలు విశేష కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకుని విధులను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంచల రామచంద్ర, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి రామిరెడ్డి, పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి వాసు అరెస్టు అక్రమం

రాజంపేట అర్బన్ : టిడిపి నాయకులు ఆదిరెడ్డి వాసు అరెస్టు అక్రమమని టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధం లేని., ఫిర్యాదులు లేని చిట్ ఫండ్ వ్యవహారాల్లో జగన్ రెడ్డి రాజకీయ శునకానందం కోసమే బీసీ నేతలైన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త ఆదిరెడ్డి వాసును సిఐడి పోలీసులు అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో గళం విప్పుతూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ఆదిరెడ్డి కుటుంబంపై కక్ష కట్టడం దారుణమని జగన్ రాజు అన్నారు. ఓవైపు వివేకానంద రెడ్డి కేసులో సిబిఐ దూకుడు పెంచుతున్న క్రమంలో కేవలం ప్రజల దృష్టి మరల్చడానికే బీసీ నేతలను టార్గెట్ చేశారని అన్నారు.

తిరుణాలకు సిఎం అదనపు కార్యదర్శికి ఆహ్వానం

ప్రజాశక్తి రాయచోటి

మే 5న నిర్వహించబోయే సంబేపల్లె శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ తల్లి తిరుణాలకు ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ధనంజయ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం ధనజయ రెడ్డి స్వగృహం చెన్న ముక్కపల్లెలో తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో అలయ కమిటీ సభ్యులు గడికోట చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్ర, ఎపిఐఐసి డైరెక్ శ్రీనివాసురెడ్డి, రాయచోటి మండలం చెన్న ముక్క పల్లె ఎంపిటిసి రామచంద్రారెడ్డి, కొండేటి ప్రసాద్ నాయుడు, రాయచోటి మండలం జడ్పిటిసి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉలుకుపాటేందుకు? : జనసేన

మదనపల్లె అర్బన్ : పవన్ కల్యాణ్, చంద్రబాబు భేటీ అయితే వైసిపి ఉలుకు పాటేందుకని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారావు రామదాస్‌చౌదరి ప్రశ్నించారు. ఆదదివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్ అసలు సిసలైన వేటగాడని తెలిపారు. వేట మొదలైతే అప్పుడు తెలుసుకుందని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు భేటీ వైసిపి నాయకులకు నిద్ర లేకుండా చేస్తోందని తెలిపారు. మదనపల్లె జిల్లా, రైల్వేలైన్ అటకెక్కించి మదనపల్లెకు తీరని అన్యాయం చేసిన ఎంపి మిథున్ రెడ్డి అన్నారు. సమావేశంలో ఐటి విభాగ నాయకులు జగదీష్, జిల్లా కార్యదర్శి సనాఉల్లా, మదనపల్లె రూరల్ అధ్యక్షులు గ్రానైట్ బాబు, రెడ్డెమ్మ, శంకర, లక్ష్మీపతి, గజ్జల రెడ్డెప్ప, జనార్ధన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాలతో మానసిక ప్రశాంతత

రాజంపేట అర్బన్ : ఆలయాలతోనే మానసిక, ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందవచ్చని వైసిపి నాయకులు వరదరాజు, మహిళా నాయకులు మిరియాల సురేఖ పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట మండల కేంద్రంలోని పెద్ద కారంపల్లి పంచాయతీలోని దళితవాడలో సీతారాముల ఆలయానికి ఆలయ పునర్నిర్మాణ అగ్ని హోమాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై హోమాన్ని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ఆలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పెద్ద కారంపల్లి కి చెందిన ప్రవాసాంధ్రులు కృష్ణ కుమార్ రెడ్డి అలియాస్ (కే.కే రెడ్డి) సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు సీతారాముల దేవస్థానమే ప్రత్యేక నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వా హకులు వెంకట సుబ్బారెడ్డి, శుభోధ్ రెడ్డి, శివరామిరెడ్డి, చొప్ప సుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మనవత కుటుంబ సభ్యులు

నిస్వార్థంగా సేవ చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

నిస్వార్థంగా సేవ చేసే వారికీ సమాజంలో ఎప్పటికి గౌరవ ప్రదమైనటువంటి విలువ ఉంటుందని రాయచోటి స్పెషల్ జ్యుడిసియల్ మేజిస్ట్రేట్ అఫ్ సెకండ్ క్లాస్ విశ్రాంత న్యాయ మూర్తి రెడ్డి కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రతిభా జూనియర్ కళాశాలలో రాయచోటి మానవత శాఖ ఉపాధ్యక్షులు సంచిపటల ఖాదర్ బాష ,చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి అధ్యక్షతన మానవత స్వచ్ఛంద సంస్థ నెల వారి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవత కుటుంబ సభ్యులతో కలిసి 2023 సవత్సర మానవత సంస్థ డైరీని వారు ఆవిష్కరించామన్నారు. ఎటువంటి లాభా పేక్ష లేకుండా ప్రజలకు కావాల్సిన సేవలను ఉచితంగా అందిస్తూ అందరి మన్నలను పొందుతున్న సంస్థ మానవత సంస్థ అని వారు కొనియాడారు . సంస్థ అధ్వర్యంలో మొక్కలు నాటడంతో విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించేలా అవగాహన సదస్సులు, ఉచిత మెడికల్ క్యాంపులు, ప్రతిభా వంతులను ప్రోత్సహించడం ,రైతన్నలకు చేదోడు వాదోడుగా ఉండడం చాలా హర్షణీయమన్నారు. మానవత గౌరవ సలహాదారుడు వెంకటరమణ ,జిల్లా డైరెక్టర్ ఆనంద్ రెడ్డి , జిల్లా కన్వినర్ వెంకట్రామి రెడ్డి (బాబు), మానవత కుటుంబ సబ్యులు పాల్గొన్నారు .

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు
బందెల గౌతం కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌతంకుమార్

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీగా బాధ్యతలు స్వీకరించి తొమ్మిదేళ్లు గడుస్తున్నా మదనపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏం చేశాడో ప్రజలకు సమాధానం చెప్పాలని, అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారంలో రెండు పర్యాయాలు మదనపల్లిలో పర్యటించిన ఎంపీ కుల రాజకీయాలకు తెరలేపి అభివృద్ధిని పక్కనపెట్టి కాపులను ఓటర్లుగా పరిమితం చేసి శ్రీకృష్ణదేవరాయల విగ్రహం పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలియజేశారు. బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్షీరామ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాపులను ముఖ్యమంత్రిగా ఉండాలని చెప్పిన మాటలు గుర్తు చేశారు. వాల్మీకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 50 లక్షలు మంజూరు చేస్తామని చెప్పి శిలాఫలకం వేసిన ఎంపీ మిథున్ రెడ్డి వాల్మీకుల అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు మంజూరు చేసి సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. వాల్మీకులను రాజకీయంగా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో కాపులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కాకుండా కేవలం కాపులను ఓటర్లుగా పరిమితం చేసి ఎంపీ మిథున్ రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో మదనపల్లె నియోజకవర్గంలో రైల్వేజోన్ కానీ , హంద్రీనీవా కాలువ కోసం ఏమాత్రం ప్రయత్నించలేదని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజ్యాధికారంలో భాగస్వామి చేసే రాజకీయ పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని తెలియచేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు రమణ బాలాజీ అరుణ్,శివ ,శ్రీనాథ్, అనిల్ , గంగాధర ,శ్రీనివాసులు, మహేష్, లక్ష్మీపతి ,పెద్దోడు, రెడ్డి మోహన్, ప్రసాద్, సోమశేఖర్ ,ప్రకాష్ ,గంగ రాజు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

29 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లిలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 29 మందికి ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, యర్రావారిపాలెం, కేవీ పల్లి, కదిరి, ఎన్.పి. కుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అర్హులైన 29 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 34 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి ,మహాలక్ష్మి, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన 108 భక్తి గీతాల ఆలాపన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మన సంస్కృతి కళా సంస్థ (తిరుపతి) వారి ఆధ్వర్యంలో మదనపల్లి కళావాహిని సౌజన్యంతో స్థానిక పట్టణంలోని సొసైటీ కాలనీ, శ్రీ రామాలయంలో ఆదివారం నిర్వహించిన 108 భక్తి గీతాలు ఆలాపన అలరించింది. ఉదయం మహిళలచే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మన సంస్కృతి కళా సంస్థ వ్యవస్థాపకులు కలకట రెడ్డెప్ప మాట్లాడుతూ గతంలో మారుమూల పల్లె ప్రజలు శ్రమైక జీవన సౌందర్యాన్ని పొందుతూ పాడుకున్న మన సంస్కృతి, సాంప్రదాయాలు, జానపద కళలు, భక్తి, భజన పాటలు రోజు రోజుకు కనుమరుగౌతున్నాయని చెప్పారు. అవి అంతరించిపోకుండా సంరక్షించుకునే క్రమంలో 'మన సంస్కృతి కళా సంస్థ (తిరుపతి) సమాజ హితంతో, సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఇదివరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో తమిళనాడులో కలిసి 14 చోట్ల 108 భక్తి గీతాలు కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. 15వ కార్యక్రమంగా స్థానిక పట్టణ సొసైటీ కాలనీలో గల శ్రీరామాలయం ప్రాంగణంలో 108 భక్తి పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ గానామృతంతో కళాభిమానులను, కళా పోషకులను, భక్తులను అలరించారు. లయన్స్ అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి కార్యక్రమంలో భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప, గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, కళా వాహిని వ్యవస్థాపకులు వేమనారాయణ, ప్రజాకవి పోతబోలు రెడ్డప్ప, విశ్రాంత జైలర్ లక్ష్మీనారాయణ, స్థానిక కళాకారులు మంచూరి మారెప్ప, సుభాషిణి, ములకలచెరువు గూడుపల్లి చంద్ర బృందం, ఐరాల రాజశేఖర్ పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, రచయితలు

సామాజిక చైతన్య విప్లవ కవి శ్రీశ్రీ

ప్రజాశక్తి-పుల్లంపేట

శ్రీశ్రీగా వెలుగొందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహాప్రస్థాన యుగకర్త, అభ్యుదయ సాహిత్య రథసారథి అని తెలుగు ఉపాధ్యాయులు గంగసపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని పివిజపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణవేణి అధ్యక్షతన ఆదివారం శ్రీశ్రీ 113వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావ కవిత్వానికి విరుద్ధముగా జెండా ఎత్తిన శ్రీశ్రీ ప్రజల పక్ష చైతన్యమే ఊపిరిగా రచనలు చేశారని పేర్కొన్నారు. విప్లవ కవిగా, సినిమా పాటల రచయితగా, మహాకవిగా పేరొందిన శ్రీశ్రీ ఆధునిక సాహితీ యుగకర్త అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిప్రసాద్, శివశంకర రాజు, సుజిత, గౌరీదేవి, భారతి, శ్రీనివాసులు, చంద్రకుమార్‌లు పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

కలకడ : మండల కేంద్రమైన కలకడలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎంఇఒ వై.ఆదినారాయణరెడ్డి, ఎస్ఇ తిప్పేస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. ఉపాధ్యాయులు, పెద్దలు, తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని చూపాలన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఇ తిప్పేస్వామి, విశ్రాంతి ఎంఇఒ ఆదినారాయణరెడ్డిని ఘనంగా సన్మానించినట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-కలికిరి

దేశాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడమే మన్ కీ బాత్ ముఖ్య ఉద్దేశ్యమని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ సందర్భంగా ... కార్యక్రమాన్ని ప్రసారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ జిఎస్.పాండురంగ మాట్లాడుతూ ప్రతినెల చివరి ఆది వారం ఉదయం 11 గంటలకు దేశ అభివృద్ధిపై ప్రజలతో తమ అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. రేడియో ద్వారా కేంద్ర ప్రభుత్వ పనితీరుతో పాటు దేశంలో పలువురు ప్రముఖుల గొప్ప తనం గురించి ప్రస్తావిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్ర వేత్తలు, రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ


ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం దాతలు మాద రవిశంకర్, రామశంకర్ దంపతులు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. గతంలో జరిగిన క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలలో మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, సౌత్‌జోన్ క్రీడలలో అద్భుత ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బాలశేఖర్ గారి అభ్యర్థన మేరకు దాతలు విద్యార్థులకు క్రీడా సామాగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, టెన్నీస్‌బాల్ మొదలగు క్రీడలలో బాగా రాణించిన పాఠశాల, గ్రామ ప్రతిష్టలు పెంపడం వల్ల వారిని క్రీడలలో అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలకు క్రీడ సామగ్రిని పంపిణీ చేయడం పట్ల దాతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిరాహారదీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ దేవస్థానం భూములు రక్షణ కొరకు శ్రీశ్రీ గంగమ్మ తల్లి భూములు పరిరక్షణ సమితి కన్వీనర్ వెంకటరామరాజు, కో-కన్వీనర్ చెంచెర్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం గంగమ్మ దేవస్థానం ఆవరణంలో నిరసన గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ కొండూరు వెంకటరామరాజు, కో-కన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు మాట్లాడుతూ గంగమ్మతల్లి జాతర రాయలసీమ ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిందని అన్నారు. నిరసన నిరాహారదీక్ష కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి వెంకటరమణ, తిరుపతి, శ్రీరాములు, జెసిపి, ఓబయ్య కదిరయ్య, రామచంద్ర, ఆదిమూలం రామచంద్ర, ఆదిమూలం శ్రీనివాసులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలికిరి

ఇటీవల రెండు వేర్వేరు ఘటనలలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎంపిపి నూర్జహాన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వి.పాఛాబంశ్, పిడుగుపాటుతో మరణించిన జహంగీర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ తరఫున వచ్చిన ఆర్థికసాయం రూ.1లక్ష, అనీపాక లక్ష రూపాయలను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా తమను సంప్రదించవచ్చని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ అర్చకులు మృత్యుంజయస్వామి ఉదయం మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్థానిక బస్టాండ్ కూడలి నుంచి అమ్మవారి శాలల వరకు పెద్ద ఎత్తున ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేకంగా ఊరేగింపుగా అమ్మవారి శాంతి తోరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు బుసనవారం నరసింహస్వామి, వైస్ ప్రెసిడెంట్ మాకం వెంకటకుమార్ చలపాటి నరసింహశెట్టి, రంజం రామకృష్ణ, సెక్రటరీ గెలివి కుమార్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు గెలివి మల్లికార్జునశెట్టి, మేడ వెంకటకుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గెలివి జయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు యంబ లూరు అనిల్‌కుమార్, గెలివి లోకేష్, వల్లంకొండు చంద్రశేఖర్, వల్లంకొండు శివ, ఎంబలూరు నరసింహ ప్రసాద్, గోపిరెడ్డి రఘు, గెలివి నరేష్, తులసి గిరి, దరిశ హేమంత్, భూపాలం సునీల్ పాల్గొన్నారు.

మేడే కొత్తస్ఫూర్తిని రగిలించాలి : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

శ్రామికులు, కార్మికుల్లో మేడే కొత్త స్ఫూర్తిని రగిలించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్మికుల్లో చైతన్యం వెల్లివిరియాలన్నారు. శ్రమ దోపిడీని అరికట్టేందుకు ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం పీడిత జాతికి మహోత్సవమన్నారు. జగన్ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. వైఎస్ఆర్ బీమాను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆటో కార్మికులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలు, రజకులు తదితర దినసరి శ్రామికులకు ఏటా ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాల పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోం దన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జగనన్నతోడు క్రింద చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు అందించి వారి జీవితాలలో వెలుగులు నింపుతోందన్నారు. **కలకడ :** మండలంలో మేడేను ఘనంగా నిర్వహించుకోవాలని పంచాయతీ కార్మికుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన కలకడ పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పండుగను కార్మికులందరూ కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన కార్మికులను కోరారు. కార్మికులకు కష్టం తప్ప ఫలితం శూన్యమని విఆర్ఎల జిల్లా అధ్యక్షులు అల్లాబకాష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు సభ్యులు వెలుగు రెడ్డప్ప, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. **కలకడ :** 137వ కార్మిక దినోత్సవాన్ని కార్మికులందరూ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య పేర్కొన్నారు. మాట్లాడుతూ మీ మీ మండలాల్లో జెండాలు ఎగేరేసి ర్యాలీలు సభలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా కార్మికులు ఉద్యోగుల ద్వారా ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపు కుంటున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిసి ఉద్యోగులకు కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ పేరుతో వారిని మోసం చేయడం తప్ప ఇంకోటి కాదని తెలిపారు. అంగన్వాడీ, ఆశ మధ్యాహ్నం భోజనం స్కీం వర్కర్ల గ్రామపంచాయతీ కార్మికులకు స్వచ్ఛభారత్ కార్మికులకుఅందరికీ కనీస వేతనాలు లేవని తెలిపారు. అసంఘటితరంగా కార్మికుల పరిస్థితి మరింత దారుణమని తెలిపారు. కార్యక్రమంలో ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామయ్య, విఆర్ఎ జిల్లా కమిటీ కన్వీనర్ అల్లా బకాష్, సంఘమిత్ర జిల్లా కార్యదర్శి రెడ్డప్ప కార్మికులు పాల్గొన్నారు.



రాయచోటి : కాలువల్లో పూడికను తొలగిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

యువత ఐక్యంగా మెలగాలి



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని తవళం గ్రామంలోని నల్లంవారిపల్లిలో ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రమేష్, శ్రీనివాసులు, ప్రతాప్, గంగాధర, మనోహర, ప్రకాష్‌లు గ్రామస్తులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లంవారిపల్లెకు చెందిన సోమశేఖర్ గ్రామంలో సత్ప్రవర్తన కలిగి, గ్రామస్తులతో స్నేహపూర్వకంగా, ఐకమత్యంతో ఉండేవారని, సోమశేఖర్ రెండేళ్ల క్రితం హఠాత్తుగా మరణించారని అన్నారు. ఆయన క్రికెట్‌ను ఎంతో ఇష్టపడే వారిని, వారి జ్ఞాపకార్థం నల్లంవారిపల్లి గ్రామంలో ఏప్రిల్ 22 నుంచి 30వ తేదీ వరకు ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంటును నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో సుమారు 30 జట్టులు పాల్గొనగా, ఫైనల్‌లో నల్లంవారిపల్లి ఎ జట్టు, పారేశువారిపల్లి జట్టు పోటీ పడ్డాయి. పారేసువారిపల్లి జట్టు గెలుపొందిందన్నారు. విజేత నిలిచిన జట్టుకు సోమశేఖర్ తండ్రి నరసింహులు చేతుల మీదుగా రూ.20,116లు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్‌లను నిర్వాహకులు ప్రదానం చేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన నల్లంవారిపల్లి జట్టుకు రూ.10,116 ప్రైజ్ మనీ, ట్రోఫీ, మెడల్స్ లను అందించారు. సోమశేఖరను ఆదర్శంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాలలోని యువత స్నేహ భావంతో, ఐకమత్యంగా మెలగాలని సూచించారు. విజేతలకు ట్రోఫీ ప్రదానోత్సవ కార్యక్రమం సోమశేఖర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వాహకులు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రమేష్, ప్రతాప్, శ్రీనివాసులు, గంగాధర, చిన్న, మనోహర, మంజునాథ్, ప్రకాష్, మహదేవ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితులపై కక్షసాధింపు తగదు : టిడిపి

ప్రజాశక్తి-రాయచోటి

దళితుల భిక్షతో గద్దనెక్కిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దళితులపైనే కక్ష కడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలలో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 20 ,21వ వార్డు నందు ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి అమీర్జాన్, అబూజర్, మండలరూరల్ అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, ఎస్‌టిసెల్ రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రెడ్డయ్య , తెలుగుయువత నాయకుడు చోటు అలియాస్, హుస్సేన్, బంగ్లా బషీర్, యౌనుస్‌ఇక్బాల్ రాము, మల్లికార్జున, పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను సాగనంపుదామని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ అన్నారు. ఆదివారం తవళం గ్రామంలోని ఉంటావారిపల్లె, ఉప్పరపల్లి, తవళం, చింతల వారిపల్లెలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో నిత్యవసర వస్తువులపై ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు నాలుగు సార్లు బస్సు ఛార్జీలు, ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు, అదనంగా ట్రూ అప్ ఛార్జీలు పెంచారని ధ్వజమెత్తారు. టమాటా ధరలు పతనమై, కనీస మద్దతు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ విలవిలలాడుతుంటే వైసిపి ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవస్థన్నీ భ్రష్టు పట్టించారని అన్నారు. మైనార్టీలకు అండగా ఉన్న అనేక పథకాలను రద్దు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మేష రామకృష్ణ, రెడ్డప్ప, రమణ, శ్రీపతి, మల్లప్ప, రెడ్డప్ప, లక్ష్మన్న పాల్గొన్నారు.



ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

రాష్ట్రంలో రాక్షస పాలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అవినీతి పాలన సాగిసుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యేలు ఎవరికి ఓటు వేశారో నాలుగు గంటలలో కనిపెట్టిన జగన్మోహన్ రెడ్డి తన సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య నాలుగు సంవత్సరాలైనా నిందితులెవరో నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో దళితులు, ముస్లింలు, బిసిలపై దాడులు పెరిగిపోయాయి అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజులు ఖాదర్‌బాషా, మండల అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, మాజీ జడ్‌పిటిసి నర్సారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, టిడిపి బిసి సాధికార సమితి, పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ శివ ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చినట్లు కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాను మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సౌజన్యంలో మొత్తం 20 కంపెనీలు కళాశాలకు వచ్చి సాఫ్ట్‌వేర్‌కోర్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉద్యోగాల కోసం జరిగిన ఇంటర్వ్యూలకు సుమారు 1240 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారిలో 312 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ జాబ్ మేళలో టెక్ మహేంద్ర, డిక్సన్, హీరో గ్రూప్, ముత్తూట్ ఫైనాన్స్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు, అల్ సెట్, నెక్స్ట్ జెన్, ఇన్నోవా, యంగ్ మైండ్స్, భారత్ ఫఫ్. నోవాక్, 24/7ఐ, హెట్రిబ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, వైస్ గ్రూప్, సోలేరా, గోసేవ, బీన్స్ సర్వీసెస్, టీసీ కంపెనీలు పాల్గొన్నట్లు మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్ తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి ఖాసీం, డాక్టర్ సత్యరాజ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పిటిఎం ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో గృహ సారథులు, కన్వీనర్లు గ్రామాల్లో మరింత ఉధృతం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, మాజీ సర్పంచ్ అలీఖాన్, జిల్లా ప్రచారకార్యదర్శి అయుబ్ బాషా, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సురేంద్ర, జడ్‌పిటిసి ఉంగరాల శివన్న, మడుమూరు సర్పంచ్ నాగరత్న భాస్కర్ నాయుడు, మండల సచివాలయం కన్వీనర్ డ్రిప్ రమణ,వాలంటీర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** బాల్ రెడ్డి గారి పల్లి పంచాయతీలో నుండి రాగి మానిపల్లి, దయ్యాలవారిపల్లి ,ఆవుల వారి పల్లి ,కాంచన పల్లెల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్తూ సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధిపై వివరించారు. ప్రజల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు అప్పిరెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, వైసిపి మండల కమిటీ చౌడేశ్వర్, నాయకులు నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, గంట్ల సురేంద్ర, వాల్దేవరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 38 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ సి.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో హైదరాబాదుకు చెందిన హెటీరో ఫార్మా కంపెనీ, ఐసిఐసిఐ బ్యాంకు సంయుక్తంగా వారం రోజులుగా ఈ ఇంటర్వ్యూలను నిర్వహించాయి. గత సోమవారం నుంచి జరుగుతున్న ఇంటర్వ్యూలలో హెటిరో కంపెనీకి 18 మంది విద్యార్థులు, ఐసిఐసిఐ బ్యాంకుకు 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమ డిగ్రీ కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం ప్రాంగణ ఎంపికలకు వివిధ కంపెనీలను ఆహ్వానించడం జరుగుతూందన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లి సబ్‌స్టేషన్ వద్ద వెలసిన ఈ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం జాతర ఘనంగా నిర్వహించారు. రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజారులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అమ్మవారి ని పలరకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు శ్యామలమ్మ, స్థానిక నాయకులు నారాయణరెడ్డి, రమణారెడ్డి, కోటిరెడ్డి ,రఘునాథ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే, నాయకులు

అట్టహాసంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటీఎం మండలం చెన్నారాయుని పల్లిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో మహోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో బాస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాస్ సీనియర్ నాయకులు సింగన్న, సచిన్, మండల అధ్యక్షులు పలక వెంకటేష్, కొగర మాధవ, సొట్ట గంగాద్రి, నల్లగొల్ల మని,చెన్నరాయుని పల్లి యూత్ నరేష్,నాగేష్,నవీన్,రెడ్డి శేఖర్, ఆనంద్, మల్లికార్జున, అరవింద్, ఆంజనేయులు, వేణుగోపాల్, నాగేంద్ర పాల్గొన్నారు.

అలరించిన ద్రౌపది స్వయంవరం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని రామాపురంలో మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం పగలు ద్రౌపది స్వయంవరం కార్యక్రమాన్ని హరిదాసు తిరుపతి చెందిన డిఎంకె సీతాలక్ష్మి ఆధ్వర్యంలో హరికథ ప్రజలకు అర్థమయ్యే రీతిలో గానం చేయడం అందరిని ఆకట్టుకుంది. ద్రౌపతి స్వయంవరం డ్రామాల రూపంలో ఎర్రగుడి గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర నాట్య కలమండలి మల్లినాయుడు వారిచే డ్రామా ప్రదర్శించి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ మహాభారత యజ్ఞం కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి, రాయచోటి, ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి హరికథను వీక్షించారు. కార్యక్రమంలో మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి మాసన వెంకటరమణ. నాగభూషణ్‌రెడ్డి. ప్రసాద్‌రెడ్డి.ఎ.పెద్దరెడ్డి, నాగబసిరెడ్డి పాల్గొన్నారు.

నేడు రామాపురం మండల సమావేశం

రామాపురం : మండల పరిషత్ సభా భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి విజయలక్ష్మి అధ్యక్షతనలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హైదర్‌వలి తెలిపారు. ఈ సమావేశానికి మండల, గ్రామ అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

జిల్లా అధ్యక్షులుగా గణేష్ యాదవ్

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వలచెరువు, గోపగుడిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో పశుసంవర్ధక శాఖ సహాయకుడిగా పనిచేస్తున్న సెల్లు గణేష్ యాదవ్‌కు జిల్లా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన శాఖలో పని చేస్తూ పశువులకు మెరుగైన వైద్యం అందించినందుకు ఇటు ప్రభుత్వ అధికారులు అటు సహాయ సిబ్బంది తనను సహకారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా తాము దగ్గరుండి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ అరెస్టు

నందలూరు : రాష్ట్రంలో బిసి నాయకులను రాజకీయంగా ఎదుర్కోలేక ఆదిరెడ్డి శ్రీనివాసులు, ఆదిరెడ్డి అప్పారావుల మీద అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం నీతిమాలిన చర్యని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెచ్చు మీరుతున్న వైసిపి అరాచకాలను కప్పిపుచ్చుకోవడానికి అమాయకులైన బిసి నేతలు, నాయకులపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న అప్రజాస్వామిక చర్యలను కప్పిపుచ్చుకోవడానికి ఇటువంటి చర్యలు పాల్పడుతున్నారని, వీటన్నింటికీ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మధుబాల, కార్యదర్శి లావణ్య ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి జూన్ 16వ వరకు ఉదయం 8 గంటల నుంచి 12 వరకు శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తునట్లు మదనపల్లె శాఖ గ్రంథాలయ అధికారి వసంత కుమారి తెలిపారు. ఈ శిబిరంలో 6 నుంచి 10వ తరగతలలో చదువుచున్న విద్యార్థులకు యోగ, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇతర అంశాలు నేర్పించుట జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక పిల్లలు ఉపయోగించు కోవాలని కోరారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో చేరాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు గ్రంథాలయ అధికారి సెల్ నంబరు 9441527822 కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మదనపల్లె అర్బన్: పట్టణంలోని హోప్ హైస్కూల్‌లో 2002-03లో పదవ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణంలో అనురాగం, ఆత్మీయ పలకరింపుల మధ్య సాగింది. గత తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొని తమ స్నేహితులతో కలిపి ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరిగ్గా 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులమంతా ఇక్కడ కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పట్లో ఒకరికొకరు చదువులో సహాయ, సహకారాలు అందించుకొని వివిధ రంగాల్లో మంచి స్థాయిలో స్థిరపడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోవన్నారు. తాము చదువుకున్న ఇందులో భాగంగా తమకు పాఠాలు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు.గురువుల చొరవతోనే తాము ఈ స్థితిలో ఉన్నామని సగర్వంగా చెప్పుకొంటూ ఫోటోలకు ఫోజులిచ్చారు. ఈ ఫోటోలను తీపి జ్ఞాపకాలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని తెలిపారు.

సుద్దలవాండ్లపల్లెలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు

ప్రజాశక్తి-రాయచోటి

సుద్దుల వాండ్లపల్లె రోడ్డు లోనిశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన వేడుకలను ఆలయ ధర్మకర్త దువ్వూరు నరసింహచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు నాగార్జున ఆచారి ప్రధాన కార్యదర్శి నటరాజాచారి, ఉపాధ్యక్షులు చెన్నూరు రత్నమాచారి, ట్రెజరర్ మట్లి వెంకటరమణాచారి, మట్లి సర్పంచ్ నాగార్జునచారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** కాలజ్ఞాన సృష్టికర్త,అవతారపురుషుడు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాలు పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో ఆవులకుటుంబ సభ్యులు పాపన్న, అవుల శ్రీనివాసులు,ఆవులవెంకట్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తంబళ్లపల్లి నియోజకవర్గం,బి కొత్తకోట పట్టణంలో సింహం వీధిలో నివాసముంటున్న మల్లూరి షౌకత్ కుమారుడు మల్లూరి మహమ్మద్ ఇషాక్ (12) అనే బాలుడు 28న శుక్రవారం తప్పిపోయిన విషయం విధితమే. బాలుడి తండ్రి పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఎస్.ఐ.రామ్మోహన్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం చిత్తూరు జిల్లా, పుంగనూరు ఆర్‌టిసి బస్టాండులో ఓ బాలుడు దిక్కుతోచని స్థితిలో ఉండగా పుంగనూరు పట్టణం నౌ జవాన్ కమిటీ అధ్యక్షులు అయూబ్ బాషా ఆ అబ్బాయిని దగ్గరకు తీసి వివరాలు అడగ్గా తాను బి.కొత్తకోట పట్టణానికి చెందిన షౌకత్ కుమారుడు మహమ్మద్ ఇషాక్ అని చెప్పడంతో ఆయన బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించాడు.దీంతో బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.తన బిడ్డ క్షేమంగా ఇంటికి తిరిగి రావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఎడివిటి ఫీచర్ - వైఎస్ఆర్/అన్నమయ్య
సోమవారం 1-5-2023

మేడే ప్రత్యేక సంచిక



శ్రమే ఆయుధం

మేడే కార్మికవర్గానికి స్ఫూర్తినిచ్చేరోజు. ఎనిమిది గంటల పనిదినం కోసం పోరాడి చనిపోయిన అమరవీరులకు నివాళులర్పించే రోజు. ఆ ఉద్యమస్ఫూర్తితో.. కార్మికవర్గం తమ పోరాటాలను సమీక్షించుకొని ముందడుగు వేసేరోజు. తమను దోపిడీ చేసే పెట్టుబడిదారీ విధానం అంతంకోసం ప్రతినబూనే రోజు.

మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా గణతి కెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లండ్ మరికొన్ని యూరోపియన్ దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. 1776 మార్చిలో వాట్ సన్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టాడు. దాన్ని ఇంగ్లండ్‌లోని ఓ బొగ్గు గనిలో మొదటిసారిగా ఉపయోగించారు. ఈ క్రమం అమెరికాకు కూడా పాకింది. బ్రిటన్‌లో పారిశ్రామిక

2లో...

◆ శ్రమజీవుల ఆశాజ్యోతి మేడే









శ్రమే ఆయుధం

(మొదటిపేజీ తరువాయి) విప్లవం వల్ల 1820 సంవత్సరంలో ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుంచి 1844 సంవత్సరానికి 60 వేలకు తగ్గింది (1860నాటికి ఇది 8వేలకు తగ్గిపోయింది). అదేకాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10 వేల నుంచి లక్షన్నరకు పెరిగారు. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి అయ్యాయి. దానితో భారీ పరిశ్ర మలు ఏర్పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు తలెత్తారు. రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి. ఆ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పారిశ్రామిక రంగ అభివృద్ధి విశేషంగా జరిగింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. పెట్టుబడిదారులు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా దోచుకుం టున్నారు. దీంతో పెట్టుబడిదారీ, కార్మికవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమైంది.

పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో శ్రామికులు బానిసల మాదిరిగా శ్రమిస్తుండేవారు. పారిశ్రామివేత్తలు అధిక లాభాలను పిండుకోవడానికి ఆరేడేళ్ల పిల్లలతోనూ, మహిళలతో కూడా ఫ్యాక్టరీల్లో, గనుల్లో పని చేయించారు. బాలకార్మికులు గనుల్లోని చీకటి సొరంగాల్లో.. బొగ్గు బళ్లను మోచేతులపైన, మోకాళ్లపైన పాకుతూ లాగేవారు. ఆఖరికి పొగగొట్టాల పైకెక్కి వాటిని శుభ్రపర్చేవారు. ఇంగ్లండ్‌లోని అనాథ శరణాలయాల్లో పిల్లలను అక్కడి అధికారులు పారిశ్రామికవేత్తలకు పశువుల మాదిరిగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుంచీ రాత్రి వరకూ యంత్రాల వద్ద నిలబడి పనిచేసేవారు. క్షణం సేపు కన్ను మూస్తే ఆ చిన్నారుల వీపులు కొరడా దెబ్బలతో చిట్లిపోయేవి. ఇక శ్రమజీవులతో రోజూ 16 గంటలు పని చేయించేవారు. మరికొందరు పెట్టుబడిదారులు 20 గంటలు కూడా పనిచేయించారు. 1806లో అమెరికా లోని ఫిలడెల్ఫియాలో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన విచారణలో కార్మికులతో యజమానులు రోజుకు 20 గంటలు పనిచేయించుకుంటున్నట్లు లోకానికి వెల్లడైంది. కార్మికులకు అతి తక్కువ జీతాలిచ్చేవారు. పని భద్రత, సౌకర్యాలుండేవి కావు. ఫ్యాక్టరీల్లో గాలీ వెలుతురు మృగ్యం. యంత్రాల వద్ద రక్షణ లేక కార్మికులు అనేక రకాలుగా ప్రమాదాల బారిన పడి మరణిస్తుండేవారు. కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతుండేవారు.

కార్మికులు తాము అనుభవించే పీడనకూ.. దోపిడీకీ కారణం తాము పనిచేసే యంత్రా లేనని భ్రమించారు. తెగించి వాటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. దీంతో పారిశ్రామికవేత్తలు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తారు. నికృష్టంగా.. దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణ రక్షణకు చలించని ప్రభుత్వం.. వెంటనే యజమానులు ఆస్తి రక్షణకు పార్లమెంటును ఉపయోగించింది. యంత్రాలను ధ్వంసం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ చట్టం చేసింది. తర్వాత కార్మికులు.. యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్థం లేదనీ.. తమ దుస్థితికి కారణం ఫ్యాక్టరీ యజ మానులే అని గ్రహించారు. ఆ దుస్థితి నుంచి బయటపడటానికి పోరాటం చేయడమొక్కటే మార్గమని అర్థం చేసుకున్నారు. దానితో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాటం ప్రారంభించింది.

అణగదొక్కబడిన కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం కృత నిశ్చయంతో చైతన్యవంతంగా పోరాటాలు జరపడానికి వీలుగా కార్మిక సంఘాల నిర్మాణానికి పూనుకుంది. 1764-1800 మధ్య గ్రేట్ బ్రిటన్‌లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. అటు తర్వాత యూరప్ ఖండంలో కార్మికవర్గం చైతన్యవంతంగా ఉన్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభమైంది. అమెరికాలోని పిలడెల్ఫియా నగరంలో పోరాట సంప్రదాయం గల కార్మికులు 1806లో "మెకానిక్స్ యూనియన్" పేరుతో కార్మిక సంఘాన్ని ప్రారంభించారు. అదే అమెరికాలో మొట్టమొదటి కార్మిక సంఘం. 1850, 60 నాటికి యూరప్ ఖండంలోని అనేక దేశాల్లోనూ, అమెరికాలోనూ కార్మికులు విప్లవోత్సాహంతో శక్తివంతమైన కార్మిక సంఘాలను నిర్మించుకొని తమ హక్కుల సాధనకోసం క్రియాశీల పోరాటాల్లోకి దూకారు.

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటా లను రక్తపుటేరుల్లో ముంచినా.. కార్మికవర్గం వెనుకంజవేయలేదు. పనిగంటల తగ్గింపు, న్యాయమైన వేతనాలు, ట్రేడ్ యూనియన్ల గుర్తింపుకోసం ప్రభుత్వం నుంచి హక్కులు సాధించడానికి కార్మికవర్గం వర్గ చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్ద ప్రథమార్థ భాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాల్లో దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి. ఇంగ్లండ్‌లో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురవేశారు. ఈ సమ్మె పోరాటం కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా చెప్పబడింది. ఫ్రాన్స్ దేశం లయాన్స్ పట్టణంలోని సిల్కు పరిశ్రమల్లో 1831లోనూ, 1834లోనూ కార్మికులు తిరుగుబాటు జరిపారు. ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి. జర్మనీలోని సైలీషి యాలో 1844లో నేత పనివారు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ద్వారా శ్రామికవర్గ నిర్మాణాత్మక పటిమ, బూర్జువావర్గంతో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయింది. నైరుతీ జర్మనీలో 1848లో విప్లవోద్యమం రగుల్కొంది. అదేఏడు ఆస్ట్రియా వియన్నాలో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. బెర్లిన్‌లో కార్మికులు, సైనికులకూ మధ్య సంఘర్షణలు జరిగాయి. చివరికి శ్రామి కులు విజయం సాధించారు. ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ కార్మికవర్గ బలమైన పోరాటాలు జరపడం వల్ల ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పనిగంటలకూ, బాల కార్మికులకూ సంబంధించినవి. బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపు పిల్లలతో రోజుకు 9 గంటలకు మించి పని చేయించరాదనీ 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల వల్ల కొన్ని చట్టాలు చేసినా నిరంకుశాధికారులు వాటిని అమలు చేయలేదు. ఏడాదికేడాది ఫ్యాక్టరీల నిర్మాణం పెరిగిపో తోంది. గనులు, రవాణా రంగాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల్లో పెరిగింది. కార్మికుల్లో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాలను చుట్టు ముట్టాయి. 10 గంటల పని దినం నిర్ణ యించాలన్న కోరిక మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు చెలరేగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్ యూనియన్ ఈ 10 గంటల పనిదినం సాధించే పోరాటాన్ని 1827లో ప్రారంభించింది. ఈ పోరాటోధృతిని తట్టుకోలేక అమెరికా ప్రభుత్వం 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటల పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

1870 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ అధికలాభాలు పోగేసుకోవడానికి అ వర్గాలకు మంచి అవకా శాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపుకోసం ఉద్యమించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నాయి. దానికి 'అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్' అని పేరు పెట్టారు. ఈ సమాఖ్య 1884 అక్టోబరు 7న తన 4వ సమావేశంలో 8 గంటల పనిదినం ప్రవేశపె ట్టాలని చారిత్రాత్మకమైన తీర్మానం చేసింది. 1886 మే 1న దేశమంతా కార్మికవర్గం 8 గంట ల పని హక్కు సాధనకు సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించింది. 8 గంటల పనిదినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం లక్షల్లో పెరిగింది. ఈ విధంగా 8 గంటల పనికోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి.

చికాగో నగరంలోని కార్మికవర్గం అమెరికన్ కార్మికవర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మికవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించేవారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ ఉండేవారు. సమ్మెకు అనేక రోజులకు పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గలవారితో ఏర్పడి పనిచేస్తోంది. ఆ సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 30న (మేడేకి ఒకరోజు ముందు) 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే 1న చికాగో నగరంలో కార్మికవర్గం చైతన్యం వెల్లివిరిసింది. నగరవీధులన్నీ ఉత్సాహవంతు లైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కార్మాగారాలన్నీ మూతపడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐకమత్యంతో మూడున్నర లక్షల మంది **(మిగతా 6లో...)**

శ్రమ దోపిడీపై పెనుగర్జన

**మేడే కార్మికవర్గానికి స్ఫూర్తినిచ్చేరోజు.
ఎనిమిది గంటల పనిదినం కోసం
పోరాడి చనిపోయిన అమరవీరులకు
నివాళులు అర్పించేరోజు.
కార్మికవర్గం తమ పోరాటాలను సమీక్షించుకొని
ముందడుగు వేసేరోజు.
తమను దోపిడీకి చేసే
పెట్టుబడిదారీ విధానం
అంతం కోసం ప్రతిజ్ఞ చేసే రోజు.**



కార్మిక వర్గం పుట్టుక - పెరుగుదల

మొట్టమొదట కార్మికవర్గం ఇంగ్లండులో పుట్టింది. 1764లో నూలు వడికే యంత్రం స్పిన్నింగ్ జెన్నీ వచ్చింది. జేమ్స్‌వాట్ ఆవిరియంత్రాన్ని కనుగొన్నాడు. యంత్రాల ఉపయోగించడం, భారీ పరిశ్రమల ద్వారా కార్మికవర్గం పెరిగింది. 1755లో ఇంగ్లండ్ 50 లక్షల పౌండ్ల పత్తిని దిగుమతి చేసుకుంటే 1844 వచ్చేటప్పటికి 60 కోట్ల పౌండ్ల పత్తిని దిగుమతి చేసుకొనే స్థాయికి ఎదిగింది. బ్రిటన్‌లోని నగరాలన్నీ నేతకార్మికులతో నిండిపోయాయి. రంగులద్దడం, చలువ చేయడం, అద్దకం పనులు, వీటితో రసాయనశాస్త్రం అభివృద్ధి చెందింది. ఆవిరి యంత్రానికి అవసరమైన బొగ్గుగనుల త్రవ్వకం కోసం, ఎగుమతి, దిగుమతి అవసరాలకు సముద్ర, రైలు, రోడ్డు మార్గాలు అభివృద్ధి అయ్యాయి. యంత్రాలకు అవసరమైన ఇనుము, రాగి, తగరం, సీసం, గాజు పరిశ్రమలు అభివృద్ధి అయ్యాయి.

8 గంటల పనిదినం కోసం పోరాటం

పెట్టుబడిదారీ విధానపు తొలి దశలో పనిగంటలకు పరిమితులు లేవు. రోజుకు 14 నుంచి 20 గంటల వరకు పని చేయించే వారు. పనిగంటల తగ్గింపు కోసం తొలి నుండి కార్మికవర్గం పోరాడుతూ వచ్చింది.అనేక ఉద్యమాల ఫలితంగా 1837లో అమెరికాలో, 1848లో ఇంగ్లండ్‌లో రోజుకు 10 గంటల పనిదినం చట్టాలొచ్చాయి. ఆ తరువాత 1864లో మొదటి కార్మిక ఇంటర్‌నేషనల్ ఏర్పడింది. అందులో పని గంటల సమస్యపై పోరాడాలని తీర్మానించారు.

అప్పట్లో అమెరికా పరిస్థితి - చికాగో ప్రత్యేకత

1492 అక్టోబరు 12 "క్రిస్టోఫర్ కొలంబస్" వెస్ట్ ఇండీస్ దీవులలో కాలుపెట్టింది మొదలు ఐరోపా ఖండంలోని వివిధ దేశాల నుండి వలసల వెల్లువ ప్రారంభమైంది. అక్కడ సాగించిన నరహంతక హింసోన్మాదం, రక్తపాతం "రెడ్ ఇండియన్" మూలవాసుల జాతి యావత్తునూ తుడిచిపెట్టేసే కార్యక్రమం. అది దాదాపు 250 సంవత్సరాలు సాగింది. కోట్లమంది యూరోపియన్లు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. దురాశాపరులైన లాభాపేక్షాపరులతో పాటు, బ్రతుకుదెరువు కోసం ఇక్కడకు చేరినవారూ ఉన్నారు. ఆఫ్రికా ఖండం నుండి సేచ్ఛా మానవులను బంధించి "బానిసలుగా" లక్షల సంఖ్యలో అమెరికా ఖండానికి తరలించారు.ఇంగ్లండ్‌కు వలసలుగా వున్న 13 అమెరికన్ రాష్ట్రాలు 1776లో స్వాతంత్ర్యం ప్రకటించు కున్నాయి. తొలుత వ్యావసాయిక దేశంగా వున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. అనేక దేశాల కార్మికులు ఇక్కడ పనిచేసేవారు. ప్రారంభంలో బ్రిటన్‌లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం 1870-1900లకు మధ్య అమెరికాలో అభివృద్ధి చెందింది. అమెరికాలో 1870లో 16 లక్షల టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి బ్రిటన్‌ను మించిపోయి 180 లక్షల టన్నులకు చేరింది. బ్రిటన్‌లో అది 52% పెరిగితే అమెరికాలో 966% పెరిగింది. ఇతర రంగాల్లోనూ అదే పరిస్థితి. అమెరికా ఉత్తరభాగాన ఉన్న "చికాగో" నగరం పెద్ద పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందింది. 1830-48 మధ్యకాలంలో జర్మనీ, ఐరిష్ కార్మికులు పెద్దసంఖ్యలో వలసవచ్చారు. వారికి పోటీగా జెక్, పోలెండ్ కార్మికులను పోటీ కార్మికులుగా రప్పించారు.

పోరాటాల్లో ముందుండే చికాగో కార్మికులు

కార్మిక పోరాటాల్లో చికాగో కార్మికులు ముందుండే సంప్రదాయం వుంది. 1877 లో అక్కడ రవాణా సమ్మె జరిగింది.ఈ సందర్భంగా 8 వేల మందితో జరుగుతున్న సమావేశంపై పోలీసులు దాడిచేశారు. ముగ్గురు కార్మికులు చనిపోయారు. ఇలా అనేక పోరాటాల్లో పాల్గొంటూ రాటుదేలిన కార్మికవర్గం చికాగోలో ఉంది.

మేడే ఎలా వచ్చింది?

1884లో "అమెరి కన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్" చికాగోలో సమావేశమై 1886 మే 1 నుంచి 8 గంటల పని అమలు జరిపించుకోవాలని, అందుకోసం అన్నీ కార్మికసంఘాలు వెంటనే ప్రయత్నాలు ప్రారంభించాలని పిలుపునిచ్చింది. రెండు సంవత్సరాల కాలం పాటు యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేయడం, కార్మికవర్గంలో విస్తృత ప్రచారం జరగాలని అమెరికన్ కార్మిక సంస్థ నిర్ణయించింది. ఈ పిలుపును అమెరికన్ కార్మికవర్గం ఉత్సాహంతో స్వీకరించింది. 1886 మే 1న అమెరికా అంతట 12 వేల పరిశ్రమల్లో 3,40,000 మంది కార్మికులు సమ్మెచేశారు. ఒక్క చికాగో నగరంలోనే 80 వేల మంది సమ్మెలో పాల్గన్నారు. ఆ మే 1వ తేదీన చికాగో నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. అమెరికాలోని పెట్టుబడిదారీవర్గమంతా ఈ ఉద్య మాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసింది. పత్రికల్లో సామాజిక యుద్ధం, పెట్టుబడి పట్ల అసహ్యం అనే పేర్లతో సమ్మెకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు.

కార్మికులకు సంఘం విజ్ఞప్తి

కార్మిక సంఘం శ్రామికుల్ని కూడగట్టుకోవడానికి ప్రయత్నిం చింది. "పీడిత కార్మికులారా మేల్కనండి. మే 1, 1886 నాడు పనిముట్లను కింద పడవేయండి. ఆరోజు విశ్రాంతి కోసంకాదు. తిరుగుబాటు కోసం. ఆ రోజు 8 గంటల పనికోసం, 8 గంటల విశ్రాంతి కోసం, 8 గంటల మన ఇష్టమైన పనుల కోసం జీవితాన్ని అనుభవించడం మొదలయ్యేరోజు" అంటూ విజ్ఞప్తి చేసింది.

మే డే నుండి చికాగో ఘటనలు

ఆ మే 1న 20 వేల మందితో భారీ ప్రదర్శన జరిగింది. 2వ తేదీన కూడా అనేక చోట్ల ప్రదర్శనలు, సభలు జరిగాయి. ఇక, ఆ మే 3న ఒకపక్క "మెక్ కోర్మిక్ రీపడ్ వర్క్స్" కార్మికుల సమావేశం జరుగుతోంది. అప్పటికే 1886 ఫిబ్రవరి 16 నుండి ఆ కంపెనీ కార్మికులు సమ్మెలో ఉన్నారు. కంపెనీలోని కార్మికులు, 6 వేల మంది మున్సిపల్ కార్మికులు ఆ పరిశ్రమకు దగ్గరలో సభ జరుపుతున్నారు. ఆ సభపై యాజమాన్యం ప్రోత్సాహంతో పోలీ సులు కాల్పులు జరపగా ఆరుగురు కార్మికుల మరణించారు. చాలా మంది గాయపడ్డారు. ఇది కార్మికుల్లో ఆగ్రహావేశాలను కలిగించింది. దాంతో, నిరసనగా 4వ తేదీన "హే మార్కెట్ చౌక్" వద్ద సభ జరపాలని నిర్ణయించారు. ముందుగా ఏర్పాట్లేవి సక్రమంగా చేయలేదు. 20 వేల మంది వస్తారనుకుంటే 3వేల మంది మాత్రమే వచ్చారు. అంతకు ముందురోజు కాల్పులు జరిగివుండటంతో నగర మేయర్ కూడా ఆ ప్రాంతానికివచ్చి సభ వద్ద వున్నాడు. ఉపన్యాసకుల ఆలస్యంతో సభ రాత్రి 8 గంటలకు ప్రారం భమైంది. రాత్రి 10 గంటల వరకు ఉపన్యాసాలు సాగాయి. వర్ష సూచనలతో త్వరగా ముగించి అందరూ వెళ్ళడానికి సిద్ధమ య్యారు. ఇంతలో పోలీసులు సభపైకి దూసుకువచ్చారు. పోలీ సుల మధ్య ఒక బాంబు పేలింది. ఒక పోలీసు చని పోయాడు. పోలీసులు కాల్పులు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు చనిపోయారు. వందల మందికి గాయాలయ్యాయి.

అక్రమ కేసు - నిర్బంధకాండ

హే మార్కెట్ ఘటన సాకుతో అమెరికా అంతటా కార్మిక వర్గంపై నిర్బంధం ప్రారంభమైంది. చికాగోలో సైన్యాన్ని దించారు. కార్మికవాడలన్నింటిపైనా దాడిచేశారు. వందల మందిని అరెస్టుచేశారు. 50 మందిపై కేసు పెట్టారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి 8 మందిని విచారించారు. 1886 ఆగస్టు 19న తుది తీర్పు వెలువడింది. ఏడుగురికి మరణశిక్ష, ఒకరికి యావజ్జీవ శిక్ష విధించారు. అయితే వీరెవరూ బాంబు వేసినట్లు ఋజువు చేయలేకపోయారు. కేవలం వారు కార్మిక వర్గానికి మద్దతుగా వున్నందుకు మాత్రమే శిక్షించబడ్డారు.

కోర్టులో స్పీస్ ప్రసంగం - జన నీరాజనం

శిక్ష పడిన కార్మికుల్లో ఒకరైన స్పీస్ కోర్టులో ధాటిగా తన మాట వినిపించారు. "మమ్మల్ని ఉరి తీసి కార్మికోద్యమాన్ని, తీరని కోరికలతో, దీనంగా అట్టడుగున వున్న లక్షలాది కార్మికులు తమ విముక్తిని సాధించుకోవడానికి సాగించే పోరాటాన్ని ఆపగలం అనుకుంటే అలాగే ఉరితీయండి. ఇక్కడే మీరు నిప్పురవ్వను రగలిస్తున్నారు. అక్కడా, ఇక్కడా మీ ముందు, మీ వెనుక ఎక్కడ పడితే అక్కడ జ్వాలలు లేస్తాయి. అది భూమి అడుగున రేగే జ్వాల. దాన్ని మీరు ఆపలేరు".

1887 సెప్టెంబర్ 14న సుప్రీంకోర్టు అప్పీలును తిరస్కరించింది. క్షమాభిక్ష కోసం గవర్నర్‌కు ప్రపంచమంతటి నుండి అప్పీళ్ళు వచ్చాయి. గవర్నర్ అంగీకరించలేదు. ఒకరిని బాంబు పేల్చడం ద్వారా జైలులోనే చంపేశారు. తమను రక్షించాల్సిందంటూ ఇద్దరు గవర్నర్‌కు విన్నవించగా మరణశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. మిగిలిన నలుగురినీ 1887 నవంబర్ 11న ఉరితీశారు. నవంబర్ 8న చికాగో నుండి నిందితులను ఉరితీసే ప్రాంతం వరకు కార్మికవర్గం ప్రత్యేకమైన రైలు నడిపింది. ఉరి తీసిన తరువాత ఊరేగింపు జరిగిన దారిలో 5 లక్షల మంది వరకు నిలబడి నివాళులర్పించారు.

న్యూయార్క్‌లో కుట్ర - పార్సన్ ప్రకటన

ఇంతకూ హే మార్కెట్ సంఘటనలో బాంబు వేసిందెవరు? అది తేలకుండానే మమ్మల్ని ఎలా శిక్షిస్తారని పార్సన్స్ కోర్టులో గర్జించారు. అయినా పెట్టుబడిదారీ తాబేదార్లయిన న్యాయమూర్తులు ఉరిశిక్ష విధించారు. ఎనిమిది గంటల పని ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడటమే వారి లక్ష్యం. అది నెరవేర్చడం కోసమే బూటకపు విచారణ చేశారు. బాంబు విసిరే మనిషిని న్యూయార్క్ నుంచే పంపించారు. పోలీసు వ్యవస్థను, న్యాయవ్యవస్థను వారు కంట్రోలు చేయగలిగారు. ఇందులో "మెక్ కార్మిక్" పరిశ్రమ యాజమాన్యానిది ముఖ్యమైన పాత్ర. దేశమంతటా 8 గంటల పని ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి పెట్టుబడిదారీ పత్రికలన్నీ కార్మికవర్గంపై విషం చిమ్మారు. 8 గంటలకు పని కుదిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థ మొత్తం నష్టాల పాలవుతుందని ప్రచారం చేశారు. వ్యాపార, వాణిజ్యవర్గాలు భారీగా నష్టపోతాయని స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై కూడా ప్రభావం చూపుతుందని వారి ప్రచార సారాంశం. 1886 ఏప్రిల్ 26న "న్యూయార్క్ టైమ్స్" పత్రిక ఇలా వ్రాసింది. "ప్రస్తుతం ప్రముఖంగా వున్న సమస్య సమ్మె. అది అనేక విధాల అవాంఛనీయం. దీన్ని పరిష్కరించడానికి సులభమైన అడ్డదారి ఒకటి వుంది. సమ్మెలో పాల్గన్న ప్రతివాడి మీద కుట్రకేసు మోపి ఖైదు చేయడం. మరో పద్ధతి నాయకులను ఎంచి శిక్షపడేటట్లు చేయడం". న్యూయార్క్ ట్రిబ్యూన్ ఇలా వ్రాసింది - "కార్మికులను చట్టవ్యతిరేక పద్ధతుల్లో పాల్గనేటట్లు చేయడం, రెచ్చగొట్టడం ఉత్తమమైన పద్దతి". వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కోసం రూపొందించుకున్న పథకం ప్రకారం హే మార్కెట్ ఇన్‌స్పెక్టర్ బోనఫ్‌ఫీల్డ్ సహకారంతో వ్యూహాన్ని అమలుచేశారు. అమెరికన్ కార్మికవర్గానికి గుండెకాయ లాంటి చికాగో నగరంలోని కార్మిక నాయకులందరిపైన నేరం చేయడం, చేయకపోవడం అనే దానితో నిమిత్తం లేకుండా శిక్షకు గురిచేశారు. వారు అనుకున్న లక్ష్యాన్ని కొంతమేర సాధించారు.

అమెరికా నుండి అంతర్జాతీయతకు

ఇప్పటికి 129 ఏళ్ళ క్రితం మే 1వ తేదీన ప్రారంభమైన కార్మికోద్యమాన్ని అణచాలని పెట్టుబడిదారీవర్గం అనుకుంటే అది ప్రపంచ మంతా అల్లుకుంది. ఆ రణన్నినాదం దేశ దేశాలను చుట్టుముట్టింది. 1889లో ప్యారిస్‌లో జరిగిన రెండో అంతర్జా తీయ కార్మికసంఘం ప్రథమ మహా సభ ప్రతి మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం జరపాలని తీర్మా నించింది. ఎనిమిది గంటల పని దినం, ప్రజాస్వామ్యం, కార్మిక హక్కుల కోసం ఉద్యమించా లని నిర్ణయించింది. 1917కు కార్మికవర్గం సోవియట్‌లో రాజ్యాధికారానికి వచ్చిన తరువాత ప్రపంచమంతా 8 గంటల పనిదినాన్ని చట్ట బద్ధంగా అంగీకరించాల్సి వచ్చింది. ఇది కార్మికులు సాధించిన విజయం. చరిత్ర మర్చిపోని ఈ అధ్యాయాన్ని స్మరించి, ఆ స్ఫూర్తితో ముందుకు సాగడమే శ్రమ జీవుల కర్తవ్యం. ◆

ప్రజాశక్తి! రా!

గొంతులేని వాళ్ల గోడు తెలపడానికి రా!
డంబాలను, ఆడంబరాలను హతమ ర్చడానికి
అబద్ధాల చీకట్ల మీదికి స్వేచ్ఛా స్వతంత్రపు
స్వర్ణకాంతులు ప్రసరించడానికి
ప్రపంచాన్ని మార్చడానికి
ప్రజాశక్తి!రా!

- మహాకవి శ్రీశ్రీ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగే వరకూ పోరాడుదాం

- ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్నఓబన్న



ప్రజాశక్తి-ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) కార్మిక వ్యతిరేక చట్టాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగే వరకు పోరాడుదామని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎఐటియుసి అనుబంధ సంస్థ ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న తెలిపారు. మే డేను పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా ఉందన్నారు. దశాబ్దాలుగా కార్మికులు దేశవ్యాప్త పోరాట ఫలితంగా బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. నిర్మాణరంగంలో యజమానుల నుండి చెస్ రూపంలోనూ కార్మికుల వద్ద నుండి మెంబర్షిప్ రెన్యువల్స్ డబ్బులను వసూలు చేసి కార్మిక ప్రయోజనాలకు ఖర్చు చేయాలని చట్టంలోనే ఉందన్నారు. ప్రభుత్వాలు ఈ చట్టం ద్వారా కార్మిక ప్రయోజనాలు కల్పించినప్పటికీ కొన్ని కోట్ల రూపాయలను ప్రభుత్వాలు వాడుకొని మళ్లీ జమ చేయడంలేదన్నారు. కార్మిక ప్రయోజనాలను తుంగలో తొక్కరన్నారు. పనులు లేక ఎంతోమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనీసం ఆ కార్మిక కుటుంబాలను ఆదుకోవడం కోసం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ భవన నిర్మాణ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుండి పథకాల పేరుతో ప్రభుత్వం ప్రచారం తప్ప, కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు దక్కలేదన్నారు. కార్మిక సంక్షేమ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న 37వేల మంది కార్మికుల క్లెయిమ్‌లకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ◆

కార్మికవర్గమే మానవాళి విముక్తి ప్రదాత

- జాన్ మోలినాక్స్

ఈనాడు అంతర్జాతీయ పెట్టుబడిదారీ –వ్యతిరేక ఉద్యమంలో లక్షలాదిమంది కార్మి కులు, ప్రజలు పాల్గొంటున్నారు. నేటి సామాజిక వ్యవస్థ మారాలని వారంతా కోరుకుంటున్నారు. అయితే ఈ మార్పు ఎలా వస్తుంది, ఎవరు ఈ మార్పు తెస్తారు అనే విషయంలో మాత్రం వీరిలో చాలా మందికి స్పష్టత ఉండడం లేదు. కొందరు ఈ మార్పు కోసం స్వచ్ఛంద సంస్థల వైపూ, ఏక సూత్ర కార్య క్రమాలు నిర్వహించే సంస్థలవైపూ చూస్తున్నారు. మరి కొందరు వెనిజులాలోని హ్యూగో ఛావెజ్, బొలీవియా లోని ఇవో మోరెల్స్ వంటి వారి పురోగామి ప్రభుత్వాలవైపు చూస్తున్నారు. మరికొందరు – వీరు తక్కువ సంఖ్యలోనే ఉన్నప్పటికీ– సాయుధ పోరాటం వైపు చూస్తున్నారు.

కారల్ మార్క్స్ కాలంలో కూడా వ్యవస్థలో సమూల మార్పులు కోరుకునే వారిలో (రాడి కల్స్‌లో) ఇటువంటి వైవిధ్యమైన అభిప్రాయాలే ఉండేవి. మార్క్స్‌కు ముందు 1840వ దశకంలో రెండు ధోరణులుండేవి. ఫ్రెంచ్ విప్లవం నుండి వచ్చిన ఈ రెండు ధోరణులు వామపక్ష భావ జాలంలో ప్రధానంగా కనిపించేవి.

అందులో మొదటిది, జాకోబిన్‌ల చేత స్ఫూర్తి పొందిన భావజాలం. చైతన్యం పొందిన కొద్ది మంది వ్యక్తులు రహస్య పథకాల ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుని అప్పుడు న్యాయమైన సమాజం ఏర్పాటుకు సామాన్య ప్రజల తరపున చట్టాలు చేయాలని వీరు భావించేవారు. వీరు ఊహించిన సమాజం సమానత్వంతో కూడిన రిపబ్లిక్‌గా ఉంటుంది. ఇందులో ప్రయివేటు ఆస్తి ఉంటుంది కాని వంశపారంపర్య హక్కులుండవు. రెండోది ఊహాజనిత సోషలిస్టుల ఆలో చనలు. వీరిలో ఫ్రాన్స్‌కు చెందిన చార్లెస్ ఫ్యూరియర్, బ్రిటన్‌కు చెందిన రోబర్ట్ ఓవెన్‌లు ముఖ్యులు. వీరి దృష్టిలో పెట్టుబడిదారీ విధానం కన్నా సోషలిజం (సమిష్టి యాజమాన్యం) అనేది సమాజాన్ని దారిలో పెట్టే మంచి వ్యవస్థ. వాద ప్రతివాదనల ద్వారానూ, నమూనా కమ్యూనిటీలు ఏర్పాటుచేసి వాటిని ఉదాహరణలుగా చూపిం చడం ద్వారానూ సోషలిస్టు వ్యవస్థను సాధించవచ్చునని వారు భావించారు. ఈ రెండు ధోరణుల్లో మనకు ఒకటి కనిపిస్తుంది. వీరిలో విప్లవ కారులు సోషలిస్టులు కారు, సోషలిస్టులు విప్లవ కారులు కారు. మార్క్స్ ఈ రెండు ధోరణులను తిరస్కరించాడు. ఇంకా చెప్పాలంటే ఈ రెంటినీ మిళితం చేసి విప్లవ సోషలిజాన్ని ప్రతిపాదించాడు. విప్లవకర సోష లిజంలో కీలక విషయం ఏమంటే ఇది కార్మికవర్గాన్ని సామాజిక మార్పు తీసుకువచ్చే ఏజెంటు గుర్తిస్తుంది. మార్క్స్ దృష్టిలో కార్మికవర్గం అంటే పెట్టుబడిదారుల చేత నియమించబడి తమ శ్రమ శక్తిని అమ్ముకునే వారు. బ్రిటన్‌లోని మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, లండన్‌వంటి నగరాల్లోనూ ఐరోపాలోని అనేక ప్రాంతాల్లోనూ జరుగుతున్న పారిశ్రామిక విప్లవం నుండి అప్పుడే పుట్టుకొస్తున్న కొత్త వర్గం అది. రహస్యవిప్లవకారులు, ఊహాజనిత వాదు లకు విప్లవం పైనుండి వస్తుంది. కాని మార్క్స్ విప్లవం కింది నుండి వస్తుందని చెప్పాడు. కార్మికులే విప్లవం తెస్తారని చెప్పాడు. "కార్మి కవర్గ విముక్తిని కార్మికవర్గమే సాధించుకోవాలి" అని ఆయన రాశాడు. మార్క్స్ తన రాజకీయాలను కార్మికవర్గం భుజస్కందాలమీద పెట్టడానికి కారణం కార్మిక వర్గపు బాధలు చూసి కాదు, దానికున్న శక్తిని చూసి. కార్మికవర్గం అనుభవిస్తున్న ఈతిబాధలు, పీడన ఇవన్నీ వర్ణనాతీతమైనవన్న దాంట్లో సందేహం లేదు. ఈ బాధే దాన్ని వ్యవస్థను మార్చాలన్న సంకల్పాన్ని రగిల్చింది. అయితే బానిసలూ, రైతులు కూడా గతంలో అనేక వేల సంవత్సరాల పాటు ఇటువంటి బాధలే అనుభవించారు. కాని వారికీ కార్మికవర్గానికీ ఉన్న తేడా ఏమంటే 1). పెట్టుబడిదారీ వ్యవస్థను ఓడించే శక్తి కార్మికవర్గంలో మాత్రమే ఉంది. 2). నూతన సమాజాన్ని నిర్మించే సామర్థ్య దానికే ఉంది. కార్మికవర్గం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థకు పుట్టిన విశిష్టమైన బిడ్డ. పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుతున్న కొద్దీ కార్మికవర్గం కూడా పెరుగు తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక యుద్ధం తరువాత మరో యుద్ధంలో కార్మికవర్గాన్ని ఓడించవచ్చు గాక, కార్మిక సమ్మెలను విచ్ఛిన్నం చేయవచ్చుగాక, యూనియన్లను నాశనం చేయవచ్చుగాక, కార్మికవర్గ స్వేచ్ఛను అణచివేయ వచ్చుగాక, కాని కార్మికవర్గం లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాలు గడించలేదు. కనుక కార్మికుల మళ్లీ మళ్లీ పోరాటాల్లోకి వస్తూనే ఉంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికవర్గాన్ని పెద్ద పెద్ద పని ప్రదేశాల్లోకి సమీకరిస్తుంది. వారిని జాతీయ, ప్రపంచ స్థాయి పరిశ్రమల ద్వారా ఒకరితో ఒకరిని అనుసంధానిస్తుంది. మహాన గరాల్లో వారిని పోగుచేస్తుంది. ఈ పరిణామమే కార్మికవర్గానికి గొప్ప రాజకీయ శక్తిని ఇస్తుంది. వారి శ్రమ లేకుండా రైళ్లు నడవవు. బస్సులు తిరగవు. లారీలు కదలవు. బొగ్గు, ఇనుము, చమురు భూమినుండి బయటకు రావు. పత్రికలు ప్రింటు కావు. టివి స్టేషన్లు ప్రసారాలు చేయవు. వారు లేకుండా బ్యాంకులు, స్కూళ్లు తెరుచుకోవు. రాజ్యాన్ని రక్షించే సాయుధ బలగాలు కూడా కార్మికులపైనే ఆధారపడతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ, కార్మికవర్గాన్ని సృష్టించడం ద్వారా చరిత్రలోనే అత్యంత పీడనకు గురయ్యే వర్గాన్ని సృష్టిస్తోంది. కార్మికవర్గ పోరాటం సహజంగానే సమిష్టిగా ఉంటుంది. 19వ శతాబ్దపు మిల్లు యజమానిని ఎదుర్కొన్నప్పుడుగాని, నేటి ఫోర్డ్, లేదా హ్యూండాయ్ కంపెనీలను ఎదుర్కొన్న ప్పుడుగాని కార్మికులు తమ శక్తులన్నిటినీ కూడదీసుకోవాలి. అందరూ కలిసి సమిష్టిగా పనిచేయాలి. ఫోర్డ్ కంపెనీనో, లేక హ్యూండాయ్ కంపెనీనో కార్మికులు స్వాధీనం చేసుకున్నారంటే వారు వాటిని (రైతులు భూమిని పంచుకున్నట్లు) ముక్కలు చేసుకుని పంచుకోలేరు. వారు చేయగలిగేదల్లా దాన్ని సామాజిక ఆస్తిగా మార్చడమే. సరిగ్గా ఈ లక్షణమే కార్మికవర్గాన్ని సోషలిస్టు వర్గంగా తయారు చేసింది. అంతే కాకుండా కార్మికవర్గం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పుడు కూడా అది సమా జంలో ఉత్పత్తి చేసే వర్గంగానే ఉంటుంది. ఎందుకంటే తను దోపిడీ చేసుకుని బ్రతకడానికి దాని కింద ఎటువంటి వర్గం ఉండదు కనుక. ఆర్థిక, రాజకీయ అధికారానికి కేంద్రంగా ఉండే మహా నగరాల్లోనూ, పెద్ద పరిశ్రమల్లోనూ కేంద్రీకరించబడి ఉన్న కార్మికవర్గానికి తన పైన మరో దోపిడీ వర్గం ఆవిర్భవించకుండా నిరో ధించే శక్తికూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఒకే సమయంలో అది ఉత్పత్తిచేస్తూ, పరిపా లనకూడా చేయగలుగుతుంది. ఆ విధంగా అది నిజమైన వర్గరహిత సమాజానికి పునాది వేయగలుగుతుంది. కార్మికవర్గం తనను తాను విముక్తి చేసుకునే క్రమంలో మొత్తం మానవాళిని విముక్తి చేస్తుంది.ఇదీ, ఈ కార్మికవర్గం యొక్క ఈ విప్లవకర పాత్రే మార్క్సిస్టు సిద్ధాంతానికి మూలం. మార్క్స్ యొక్క తత్వశాస్త్రం, చరిత్ర, ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం...అన్నీ ఇక్కడినుండే ప్రారంభ మవుతాయి. మార్క్స్ ప్రతిపాదించిన సూత్రాల్లో ఒక్క దాన్ని కూడా మేధావులుగాని, పండితు లుగాని చివరికి మార్క్సిజం పట్ల సానుభూతి లేని వారు కూడా తిరస్కరించ లేకపో తున్నారు. కాకపోతే వాళ్లంతా "కార్మిక వర్గం మారి పోయింది" అన్న అరిగిపోయిన రికార్డు వేస్తుంటారు. నిజమే, కార్మికవర్గం మారింది. దాని పని మారింది. జీతం మారింది. దాని జాతులు మారాయి. దాని సంస్కృతి మారింది. కాని దాని మౌలిక స్థితి మాత్రం అలానే ఉంది. ఇప్పటికీ అది పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క బిడ్డే. ఇప్పటికీ అది తన శ్రమ శక్తిని అమ్ముకుని బ్రతుకుతోంది. ఇప్పటికీ దోపిడీకి గురవుతోంది. ఇప్పటికీ సమిష్టిగా ఉద్యమాలు సాగిస్తోంది. అదే సమ యంలో కార్మికవర్గం పరిమాణంలోనూ, సామ ర్థ్యంలోనూ విపరీతంగా పెరిగింది. మార్క్స్ కాలంలో కార్మికవర్గం పశ్చిమయూరప్‌కు మాత్రమే పరిమితం అయి ఉండేది. కాని ఈ నాడు అది అయిదు ఖండాలకూ విస్తరించింది. అయిదు ఖండాల్లోనూ సావోపోలో నుండి సియోల్ దాకా పోరాడుతోంది. ఇక్కడే సోషలి జానికి పునాది, మానవాళికి ఆశాజ్యోతి దాగి ఉంది. ◆

అనువాదం: వెంకట్రావు

శ్రమే ఆయుధం

(6వ పేజీ తరువాయి) కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8గంటల పనిదినాన్ని సాధించి తీర్తామనే దృఢ విశ్వాసం వారందరి లోనూ కనిపించింది. సమ్మెను విజయవంతం చేయడానికి వారు సర్వ శక్తులనూ ఒడ్డటానికి సిద్ధమయ్యారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికవర్గ ఉద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకు న్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగ ప్రవేశం చేసింది.

మే 3న శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక జనసమూహంపై అమెరికన్ పోలీసులు కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులను బలి తీసుకున్నారు. ఈ దారుణ హత్యాకాండ పట్ల అసమ్మతి తెలిపేందుకు మే 4న నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా సాగుతున్న ఆ సభ మీద పోలీసులు విరుచుకు పడ్డారు. మధ్యలో బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో.. సన్నీలతో స్వైరవి హారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహిగా తలపడ్డారు. ఈ సంఘర్షణలో ఏడుగురు పోలీసులు చనిపోగా.. నలుగురు కార్మికులు నేలకొరిగారు. పాలకులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన "అరుణపతాకం".

హే మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది. న్యాయస్థానం ముందు విచారణా తతంగం జరిపి సార్సన్, ఫ్పిన్, పిషర్, ఏంగెల్ అనే కార్మిక నాయకులను ఉరి తీయించింది. తనను ఉరితీసే ముందు స్పిన్ ఇలా అన్నారు. "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయనుకుంటున్నారా? ఇదిగో అక్కడ, ఇక్కడ, ఆమూ లు, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్ని చోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంత ర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరంకాదు". దేశమంతా ఇతర కేంద్రాల్లో కూడా ఈ దమ నకాండ కొనసాగింది. అమెరికన్ కార్మికుల్లో మాత్రం మే1న విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ వర్గ చైతన్యాన్ని ప్రదర్శించ డానికి వీధుల్లోకి వచ్చాడు. 1886 మే 1న ప్రపంచ కార్మిక వర్గ విప్లవ చరిత్రలో రక్షాక్షరా లతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమం దేశంలోని అనేక ముఖ్య నగరాలకు వ్యాపించింది. న్యూయార్క్, బాల్టిమోర్, వాషిం గ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయిడ్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా పోరాటంలోకి దూకారు. ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులను ఉత్తేజపరిచి వారిలో ఆశాజ్యోతిని వెలిగించింది మే దినోత్సవం.

ప్రజాశక్తి స్వాగత గీతిక

"ప్రజాశక్తి" దినపత్రిక
నిజ కమ్యూనిజ వేదిక
శ్రామిక జన శ్రేయస్కర
సామ్య సంఘ సంస్థాపక
ధన స్వామ్య వర్గమ్ములు
నినదించే దిన వార్తల
సరిది ద్దుచు జనావళికి
సత్య ముచాటే గొంతుక
గణతంత్రము పేరు చెప్పి
గద్దెలెక్కి గద్దించే
అధినాథుల అవినీతిని
హడలగొట్టు అక్లేసిక
చెదరగొట్టు ఝుఝూభ్రిక
వస్తున్నది వస్తున్నది
వాస్తవాన్ని తెస్తున్నది
ప్రఖ్యాపన మార్క్సీయము
వ్యాఖ్యానము చేసున్నది
నడుం కట్టి తుడుంకొట్టి
నవ మార్గం వేస్తున్నది
సుత్తిపట్టి కొడవలెత్తి
శభరావం చేస్తున్నది
జనుల వలన జనుల కొరకు
జనరాజ్యం విత్తుకుంది
జయపతాక మెత్తుకుంది

- ఆరుద్ర

నిరాడంబరుడు మన సుందరయ్య

మే 1న సుందరయ్య జయంతి సందర్భంగా

పుచ్చలపల్లి సుందరయ్య బాగా కలవారింట పుట్టారు. గొప్ప నాయకునికి ఉండవలసిన త్యాగశీలత, నిరాడంబరత్వం, తాను నమ్మిన విషయాలను నిష్టగా భల్లూకపట్టుతో అనుసరించడం ఆయనకు చిన్ననాడే అలవడ్డాయి. ఏది చేసినా నిష్టగా, తపస్వీవ్రతంగా చేయడం ఆయనకు అలవాటై పోయింది. ఈ గుణం పద్నాలుగో ఏటనే రాజకీయాల్లో ప్రవేశించి, 'సోదర సమితి'ని స్థాపించినప్పుడు పొటమరించి, అన్నవరం ఆశ్రమంలో చిగురించి, సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో విరిసి, బోర్‌స్టల్ స్కూలు శిక్ష అనుభవంతో మరింత విస్తరించి ఆయనను ఒక మహానాయకునిగా తీర్చిదిద్దింది.

సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడులో 1913 మే 1న ఓ ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. బాల్యంలోనే వివేకానంద, రామతీర్థుల బోధనలను ఆకళింపు చేసుకున్నారు. గాంధీజీ దేశసేవా దీక్షతో ఉత్తేజితులయ్యారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావు వంటి ఆంధ్ర మహాపురుషుల సాహితీ వికాసం తోనూ, సాంఘిక చైతన్యంతోనూ ఆంధ్రాభిమానాన్ని పెంపొం దించుకున్నారు. తన 14వ ఏటనే మద్రాసులో అఖిల భారత కాంగ్రెస్ మహాసభను సందర్శించారు. సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన హర్తాళ్‌లోనూ, ప్రదర్శనలోనూ పాల్గొన్నారు. 1930లో మద్రాసు లయోలా కళాశాలలో ఇంటర్ చదువుతూ తోటి విద్యార్థులతో కలిసి 'సోదర సమితి' స్థాపించారు. దేశాభిమానాన్ని పెంపొందిం చడం, రాజకీ యాలను అవగాహన చేసుకోవడం, ఆదివారాల్లో ఖద్దరు అమ్మడం, కసరత్తు చేయడం, సాంఘిక దురాచారాలను రూపుమాపడం, సెలవుల్లో తమ గ్రామాల్లో రైతు కూలీలను విజ్ఞానవంతులుగా చేయడానికి కృషి, సేవ చేయడం 'సోదర సమితి' లక్ష్యాలు. సుందరయ్య ఓ వేమన జయంతినాడు గ్రామంలో సవర్ణ హిందువులకూ, హరిజనులకూ కలిపి భోజనం ఏర్పాట్లు చేశారు. గ్రామం లోని ధనికరైతులూ, సనాతనులూ ఇది జరగడానికి వీల్లేదనీ దౌర్జన్యానికి తల పడ్డారు. గాంధీ పంథాలో ఆనాడు విశ్వాస మున్న సుంద రయ్య వారి హృదయాల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు రెండురోజులపాటు నిరశన దీక్ష చేశారు.

1930 ఏప్రిల్లో గాంధీజీ పిలుపునందుకొని పూర్తిగా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనాలనే సంకల్పంతో కళాశాల చదువుకు స్వస్తి చెప్పదలిచారు. తల్లికీ, అన్నకూ కాలేజీ వదిలిపెడుతున్నానని ఉత్తరం రాసి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉన్న సత్యాగ్రహ శిబిరంలో చేరారు. అక్కడాయన.. తన నిరంతర కృషికి నిరాడంబరమైన, నిర్మాణాత్మకమైన జీవితానికి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. తరువాత ఆయనక్కడుండగానే ప్రభుత్వం అరెస్టు చేసి రెండేళ్ల శిక్ష విధించింది. బాలుడవడంతో ఆయనను తంజావూరులోని బోర్‌స్టల్ స్కూలుకు పంపించారు. అక్కడ రాజకీయ ఖైదీలనుభవిస్తున్న దుర్భర పరిస్థితులకు అసమ్మతిగా జరిగిన ఆందోళనకు నాయకత్వం వహించి రెండుసార్లు నిరసన వ్రతాలను నిర్వహించారు.

1933లో హరిజనోద్యమ సందర్భంగా గాంధీజీ ఆంధ్రదేశ సంచారం చేసినప్పుడు కాంగ్రెస్ వలంటీర్ సంస్థకు ఉప అధికారిగా పనిచేశారు. శాసనోల్లంఘ నోద్యమం విఫలం కావడంతో ఆయన అనేక మంది యువకులతోపాటు దేశ స్వాతంత్ర్య సాధనకు ఇతర మార్గాల గురించి ఆలోచించ సాగారు. బలప్రయోగంతో మాత్రమే బ్రిటీషు వారిని పారదోలగలమనే ఆలోచనలోకి వచ్చి టెర్రరిస్టులతో సంబం ధాలను పెట్టుకోవడం ప్రారంభిం చారు. బెంగుళూరులో ఉన్న ప్పుడు మార్క్సిస్టు సాహిత్యాన్నీ రష్యా విప్లవానికి సంబం ధించిన పుస్తకా లనూ అధ్యయనం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయనకు దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పడానికి ఉత్తరా ది నుంచి పంపబడిన అమీర్ హైదం ఖాన్‌తో సంబంధం ఏర్పడింది. దానితో సుందరయ్య తన తోటి సహచరులకూ, కాంగ్రెస్ లోని విప్లవ భావాలుగల యువకులకూ టెర్రరిస్టు ఉద్యమంతో ఉపయోగం లేదని వివరించి వారినందరినీ కమ్యూనిస్టు పార్టీవైపు తిప్పడం ప్రారంభించారు. 1934లో ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. పార్టీని నిర్మిస్తూనే ఆయన కాంగ్రెస్ కార్యకలాపాల్లో కూడా చురుగ్గా పాల్గొంటూ ఉండేవారు. అదేఏడు ఆయన పిసిసి సభ్యుడుగానూ, ఎఐసిసి సభ్యుడుగానూ ఎన్నుకోబడ్డారు. ఆ తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చాలాకాలంపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఒక్క ఆంధ్రలోనేగాక తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా కమ్యూనిస్టు పార్టీని స్థాపించే బాధ్యత సుందరయ్యకు అప్పగించారు. కేరళలో ఆనాడు కాంగ్రెస్‌లో అతివాదులుగా పనిచేస్తున్న కృష్ణపిళ్లే, నంబూద్రిపాద్ మొదలగువారితోనూ, తమిళనాడులో పి.రామమూర్తి ప్రభృతులతోనూ సంబంధాలు పెట్టుకొని వారిని కమ్యూనిస్టు పార్టీ వైపుకు ఆకర్షించేటట్టు చేయగలిగారు. వారి సహాయంతో ఆ రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. సుందరయ్య తల్లిదండ్రుల ఆస్తిలో తన వాటాకు వచ్చిన యావదాస్తినీ తెగనమ్మి, ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఖర్చు పెట్టి ఆంధ్రదేశంలో మహోన్నతమైన త్యాగ సంప్రదాయాన్ని నెలకొల్పారు. స్వంత ఆస్తి అంటూ ఏమీ లేకుండా చేసుకొని విప్లవ ప్రజా ఉద్యమానికి సంపూర్ణంగా తన జీవితాన్ని అంకితం చేశారు.

తెలంగాణా ప్రాంతంలో పనిచేస్తున్న ఆంధ్ర మహాసభ నాయకులతో అంతకుముందేగల సంబంధాలను మరింత దృఢపరుచుకొని అక్కడ నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించినవారిలో సుందరయ్య ఒకరు. యావదాంధ్రదేశం ఒకే ప్రభుత్వం కింద ఉండాల్సిన ఆవశ్యకతను ప్రబోధించుతూ మొట్టమొదటి సారిగా కమ్యూనిస్టు పార్టీ తరపున 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే



పుస్తకాన్ని తెలుగులోనూ, ఆంగ్లంలోనూ ప్రచురించి విశాలాంధ్ర నినాదాన్ని నినాదాన్ని ఆంధ్ర ప్రజల్లోనేగాక యావద్భారతంలోనూ ప్రచారం కావడానికి తోడ్పడ్డారు. ఆ గ్రంథమే ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేసిందంటే అతిశయోక్తికాదని 'ఆంధ్రపత్రిక' తెలుగు వెలుగు శీర్షికన సుందరయ్య గురించి ప్రస్తావించింది. తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర మహాసభ నాయకత్వాన నైజాం నవాబుకు, నిరంకుశ, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగానూ తిరుగుబాటు ప్రారంభమైంది. అదే సందర్భంలో కోస్తా ఆంధ్రప్రాంతంలో కూడా పీడిత ప్రజలు తమ హక్కులకై ప్రత్యక్ష పోరాటాలకు నానాటికీ తయారవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మద్రాసులో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు జారీ చేసి కమ్యూనిస్టులను పట్టుకొని డిటెయిన్ చేయడం ప్రారంభించింది. దానితో సుందరయ్య అజ్ఞాతవాసంలోకి వెళ్లాల్సి వచ్చింది. ఈ కాలంలో ఆయన చారిత్రాత్మక వీర తెలంగాణా సాయుధ విప్లవ పోరాటానికి నేతృత్వం వహించారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ పెద్ద పార్టీగా ఎన్నికైంది. అయితే మద్రాసు రాష్ట్ర పరిధిలోని తమిళ ప్రాంతంలోనూ, మరట్వాడా, కర్నాటక ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు హెచ్చుగా స్థానాలు రావడంతో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. రహస్యంగా ఉండగానే సుందరయ్య రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1952లో ఉభయ సభల్లో కాంగ్రెస్ తరువాత కమ్యూనిస్టు పార్టీకే హెచ్చు సీట్లు రావడంతో దానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించింది. కమ్యూనిస్టు పార్టీ పక్షాన సుందరయ్య పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్లమెంట్‌లో వచ్చే ప్రతి సమస్యపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి అన్ని చర్చల్లోనూ ఆయన పాల్గొంటూ ఉండేవారు. పార్లమెంటరీ వ్యవహారాలనేగాక, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడుగా ఆయన కేంద్రంలో ఇతర బాధ్యతలు కూడా చూసేవారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడుగా సుందరయ్య తన నిరంతర కృషి ద్వారా నిర్మాణాత్మకమైన సూచనల ద్వారా నిశితమైన విమర్శల ద్వారా అందరి అభిమానాన్నీ గౌరవాన్నీ చూరగొన్నారు. 1955లో ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రి వర్గం పడిపోయి మధ్యంతర ఎన్నికలు జరిగినప్పుడు సుందరయ్య గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. దానితో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి తిరిగి ఆంధ్ర రాజకీయాల్లో ప్రధానంగా పనిచేయనారంభించారు. ఆంధ్ర రాష్ట్ర శాసనసభలోనూ, తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోనూ సుందరయ్య ప్రతిపక్ష నాయకుడుగా ఉండి ఆ స్థానానికి ఒక విశిష్టతను చేకూర్చారు. అంతకుముందు ఎప్పుడూ పాలక వర్గ పార్టీ ముఖ్యునికే ఇవ్వబడే పబ్లిక్ అకౌంట్ కమిటీ (పిఏసి) అధ్యక్ష పదవిని మొట్టమొదటసారిగా ప్రతిపక్ష నాయకుడికి ఇచ్చి ఆంధ్ర శాసనసభ సుందరయ్యను గౌరవించింది.

విప్లవోద్యమం, పార్టీ నిర్మాణ కార్యక్రమం, పార్టీ–ప్రజాసంఘాల కార్యకలాపాలు, పార్లమెంటరీ రంగం ఏదైనా కానీయండి దేనిలోనైనా సంపూర్ణంగా లీనమై కృషి చేయడం.. ఇతరులకంటే మిన్నగా ఆదర్శప్రాయంగా కృషి చేయడం సుందరయ్యలోని ప్రత్యేకత. ఆయన పరిశ్రమశీలత వల్ల ఏ విషయమైనా వివిధ దృక్పథాలతో క్షుణ్ణంగా చదివి, ఆకళింపు చేసుకొని ప్రతివాదులతో పోరుకు ఆయన తలపడతారు. ఒకసారి పార్లమెంట్‌లో క్రిమినల్ లా సవరణ బిల్లు చర్చకు వచ్చింది. న్యాయ శాస్త్రానికి సంబంధించి క్లిష్టమైన క్లాజులతో నిండి ఉండే ఇలాంటి బిల్లుపై చర్చలో న్యాయవాద సభ్యులు మాత్రమే మామూలుగా పాల్గొనడం కద్దు. అలాంటిది సుందరయ్య ఒక రాత్రంతా కూర్చొని బిల్లును సమగ్రంగా అధ్యయనం చేసి అవగాహన చేసుకొని బిల్లుకు ప్రతిపాదించవలసిన సవరణలను తయారు చేసుకొని మరుసటి రోజు చర్చల్లో న్యాయవాద సభ్యులకంటే బాగా మాట్లాడగలిగారు. ఆయన పరిశ్రమకూ, దీక్షకూ తోటి సభ్యులు ఆశ్చర్యపోయారు. ఓ మారెవరో 'నీకు రాజకీయా లంటే తెలుసునేమోగానీ ఆంధ్ర సాహిత్యం సంగతి ఏమి తెలుసు?' అని అధిక్షేపించారట. ఆనాటికుండే ఆయన నన్నయ మొదలు నేటి ఆధునిక కవులుదాకా రాసిన ప్రధాన గ్రంథాలను పుక్కిటబట్టి అర్థంకాని వాటిని పండితుల వద్ద తెలుసుకొని 'ఇక భయంలేదు' అని గుండెమీద చేయివేసుకున్నారట. అందుకు తార్కాణంగా ఆయనవద్ద ఆంధ్ర సాహిత్యానికి సంబంధించిన పెద్ద గ్రంథాలయమే ఉండేది.

భారత కమ్యూనిస్టు పార్టీలో పొడసూపిన రివిజనిస్టులతో తెగతెంపులు చేసుకొని 1964లో కలకత్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ని పునర్నిర్మించారు. ఆ మహాసభలోనే సుందరయ్య పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తిరిగి ఆయన దేశవ్యాపితంగా పార్టీని పునర్నిర్మించడంలో నిమగ్నమయ్యారు. 1967 ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన ఐక్య సంఘటనా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేరళలో ఇంఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా ఉండగా.. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ మంత్రివర్గాలు పనిచేస్తున్న కాలంలోనే పార్టీలో తీవ్రవాద పోకడలు ఉత్పన్నమైనాయి. రష్యా–చైనా మధ్య ఏర్పడిన వివిదాలతో ఈ పోకడలు మరింత ఉధృతం కావడంతో పార్టీలో అతివాద దుందుడుకు పెడధోరణి ప్రమాదమేర్పడింది. ఈ ఆటుపోట్లనుంచీ కూడా పార్టీని నిలబెట్టుకోవాల్సివచ్చింది.

తన జీవిత చరమాంకంలో కేంద్ర బాధ్యతలను వదులుకొని రాష్ట్రంలో పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఆనాటికి రాష్ట్రంలో వందలాది మంది యువకులను నక్సలైట్ల పేర అమానుషంగా కాల్చి చంపించిన జలగం వెంగళరావు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించారు. పౌరహక్కులతోపాటు ప్రజాతంత్ర హక్కుల సంరక్షణకు దేశ ప్రజల దృష్టి మళ్లించడానికి శాయశక్తులా కృషి చేశారు. భార్గవ కమిషన్ ముందు వెంగళరావు ప్రభుత్వం జరిపించిన అమానుష హత్యలు రుజువు చేయించడానికి ఆయన తీవ్రంగా కృషి చేశారు. ప్రజా సమస్యలపై 1980 ప్రాంతాల్లో అన్ని పార్టీలనూ కూడగట్టి అఖిల పక్ష ఉద్యమాలకు అంకురార్పణ చేశారు. చారిత్రాత్మక సిపిఎం 11వ మహాసభను విజయవాడలో జయప్రదంగా నిర్వహించడానికీ, కృష్ణానదీ గర్భంలో బ్రహ్మాండమైన సభ జరపడానికీ నిర్విరామంగా కృషి చేశారు. విప్లవ ప్రజా నాయకుడు, విరామమెరుగని నిష్కలంక ప్రజాసేవకుడు, ఉత్తమ శ్రేణి దేవభక్తుడైన సుందరయ్య 1985 మే 19న కన్నుమూశారు.



తల్లితో పుచ్చలపల్లి సుందరయ్య

గ్లోబలైజేషన్



అద్దేపల్లి రామమోహన్ రావు

'అంతర్జాతీయ వ్యాపార
తుఫానులో
సొంత ముద్ర చెరిగిపోయిన
వింత వస్తువును నేను
మనిషి స్థానంలో
వస్తువునారాధిస్తున్న
కొనుగోలు దారుణ్ణి నేను
నిన్న నేను నా అవసరానికే
వస్తువులు కొన్నాను
నేడు నేను నా స్థాయి
కోసం వస్తువులు
కొంటున్నాను
రేపు నేను ఒక వస్తువుని
కావడం కోసం
జీవితాన్ని అమ్ముకుంటాను'



గురుజాడ అప్పారావు

'మనిషి చేసిన రాయిరప్పకి
మహిమ కలదని
సాగిమొక్కుచు
మనుషులంటే రాయి
రప్పల
కన్న కనిష్టం
గాను చేస్తావేల బేలా
దేవుడెకడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడే
వేలా?
కన్ను తెరిచిన కనబడడో
మనిషి మాత్రుడి
యందులేడో
యెరిగి కోరిన కరిగి
యీడో ముక్తి?